స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ కోటేశ్వరరావు

ఉపాధ్యాయుల బదిలీల నిలిపివేత

- సీనియారిటీ జాబితా ఖాళీల ప్రకటన బ్రేక్

- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు - ప్రాధాన్యత కేటగిరిపై ఉపాధ్యాయుల్లో అనుమానాలు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఉపాధ్యాయుల బదిలీలకు తాత్కాలికంగా నిలిపివేయాలని రాష్ట్ర హైకోర్టు ప్రభుత్వానికి సూచించింది. ప్రస్తుతానికి చేపట్టిన ప్రక్రియను యధా స్థితిలో ఉంచాలని ఆదేశించింది. సీనియారిటీ జాబితా, ఖాళీల ప్రకటన కూడా విద్యాశాఖ ప్రకటించకుండా బ్రేక్ వేసింది. ఉపాధ్యాయుల బదిలీలపై గత కొంతకాలంగా రాష్ట్రప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు పట్ల ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బదిలీలకు సంబంధించి జారీ చేసిన ఉత్తర్వుల్లో అనేక అంశాలు అసంబద్ధంగా ఉన్నాయని ఉపాధ్యాయ సంఘాలు గగ్గోలు పెడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కర్నూలు జిల్లాలో మొత్తం ఉపాధ్యాయుల బదిలీలకు 6759 మంది దరఖాస్తు చేసుకున్నారు. బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు 0 సంవత్సరం నుండి తీసుకోవడంతో పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. వాస్తవానికి జిల్లాలో కేవలం వెయ్యి మంది ఉపాధ్యాయులు మాత్రమే బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హత సాధించారు. మిగిలినటువంటివారు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులకు అనుగుణంగా దరఖాస్తు చేసుకున్నారు. బదిలీలపై కొంతమంది హైకోర్టును ఆశ్రయించడంతో సోమవారం హైకోర్టు ఈ కేసును విచారించి రాష్ట్ర ప్రభుత్వం జనవరి 4వ తేదీలోగా తమ పూర్తిస్థాయి సమాచారాన్ని అందజేయాలని వాయిదా వేసింది. దీంతో ఇప్పుడు వరకు చేపట్టిన ప్రక్రియను మొత్తం విద్యాశాఖ అధికారులు నిలుపేసారు. ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన సీనియారిటీ జాబితాలను ప్రకటించాల్సి ఉండగా బ్రేక్ పడింది. మంగళవారం నుండి బదిలీలకు ఉపాధ్యాయుల నుండి వెబ్ ఆప్షన్స్ నమోదు ప్రక్రియను చేపట్టాల్సి ఉండగా అది కూడా కోర్టు ఆదేశాలతో నిలిచిపోయింది.

ప్రాధాన్యత కేటగిరి పాయింట్లు పై మండిపాటు

ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ప్రాధాన్యత కేటగిరీ కింద విద్యాశాఖ అధికారులు పరిగణలోకి తీసుకున్నారు. ఇటీవల అక్టోబర్ నెలలో అనేకమందికి ఉపాధ్యాయులకు గ్రేడ్ 2 హెచ్ఎంలుగా , స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించింది. అలాంటి వారికి కూడా ప్రాధాన్యత క్యాటగిరి కింద పాయింట్లను ఇచ్చేందుకు విద్యాశాఖ ఇచ్చిన నిబంధనలపై ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. మరి కొంతమందికి కుటుంబ సభ్యులకు దీర్ఘకాలిక వ్యాధులు ఉంటే వారికి కూడా ప్రాధాన్యత కేటగిరీ కింద పాయింట్లు మంజూరు చేసేందుకు ఇచ్చిన నిబంధనలను కూడా సరైంది కాదని పలువురు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ఉపాధ్యాయుల బదిలీలను గందరగోళపరిచేందుకే ఇలాంటి చర్యలు తీసుకున్నట్లు కొంతమంది ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు.

సిఫార్సు వారికి సాధారణ బదిలీలోనే

కొంతమంది అధికార పార్టీ నేతలు సిఫార్సు చేసిన వారికి బదిలీలకు ఉత్తర్వులు జారీ చేసేందుకు సాధారణ బదిలీల తోనే వీరికి నియామకాలను చేపట్టేందుకు సన్నద్ధమైంది. ప్రత్యేకంగా వీరికి బదిలీల నియామక పత్రాలను అందజేస్తే ఉపాధ్యాయ సంఘాల నుండి వ్యతిరేకత వస్తుందని నెపంతో విద్యాశాఖ అధికారులు వాటిని నిలిపివేశారు. సిఫార్సుల ద్వారా పొందిన వారికి స్థానాల కేటాయింపులకు సంబంధించి ముందుగానే వాటిని విద్యాశాఖ అధికారులు బ్లాక్ చేశారు. వీరికే సాధారణ బదిలీ పొందిన ఉపాధ్యాయులతో సమానంగా నియామక పత్రాలను అందజేస్తే ఎటువంటి వ్యతిరేకత ఉండదని భావించి వారి వివరాలు గోప్యంగా ఉంచారు.

షెడ్యూల్‌కు అనుగుణంగా బదిలీలు చేపట్టాలి

- కె.సురేష్ కుమార్, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు

ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్‌కు అనుగుణంగా నిర్వహించాలి. హైకోర్టు ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి లేవనెత్తిన అంశాలపై స్పష్టమైన సమాచారం విద్యాశాఖ అధికారులు ఇవ్వాలి. పారదర్శకంగా ఈ బదిలీలు జరిగేలా చూడాలి.

ఏ ఒక్కరి పింఛన్ రద్దు చేయం

- నోటీసులు అందిన వారు తగు సమాచారం ఇవ్వండి
- కలెక్టర్ కోటేశ్వరరావు

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

ఏ ఒక్కరి పింఛన్ రద్దు చేయబోమని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు ప్రకటించారు. ఎవరైతే నోటీసులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల ప్రకారం సమాచారాన్ని సచివాలయాలకు వెళ్లి ఇవ్వాలని కోరారు. సోమవారం కలెక్టరేట్లోని సునయన ఆడిటోరియంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ పి.కోటేశ్వరరావు జాయింట్ కలెక్టర్ రామసుందర్ రెడ్డి, డిఆర్ఒ నాగేశ్వరరావులతో కలిసి బాధితుల వినతలను స్వీకరించారు. అనంతరం స్పందన అర్జీలపై ఇతర అంశాలపై జిల్లా అధికారులతో అక్కడే సమీక్ష కలెక్టర్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన వారి పింఛన్లను తొలగించడం ప్రభుత్వ ఉద్దేశ్యం కాదన్నారు. అర్హత ఆధారంగా పింఛన్లు మంజూరు అవుతాయని కలెక్టర్ స్పష్టం చేశారు. నోటీసులు ఇచ్చిన వారికి సంబంధించి నిబంధనల ప్రకారం డీటైల్డుగా విచారణ జరిపి ఈ నెల 28లోపు నివేదికను సమర్పించాలని కలెక్టర్ ఎంపిడిఒలు, మునిసిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఈ అంశంపై పర్యవేక్షణ చేయాలని డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకట సుబ్బయ్య ను ఆదేశించారు.. జిల్లాలో 8860 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేయడం జరుగుతోందని కలెక్టర్ వెల్లడించారు. హౌసింగ్ బిల్లుకు త్వరితగతిన చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, బిల్లుల చెల్లింపులకు సంబంధించి హౌసింగ్ సిబ్బందిపై ఫిర్యాదులు రాకూడదని కలెక్టర్ హౌసింగ్ పిడిని ఆదేశించారు.

పతకాలు సాధించాలి: డివిఇఒ

ప్రజాశక్తి-కర్నూల్ స్పోర్ట్స్

క్రీడాకారులు చక్కటి ప్రతిభను కనుపరిచి పతకాలు సాధించాలని డివిఇఒ జమీర్ బాష అన్నారు. సోమవారం అండర్ 19 స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో నగరంలోని అశోక్‌నగర్‌లో ఉన్న ఆర్యే రైఫిల్ షూటింగ్ అకాడమీలో ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి రాజమండ్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జిల్లాకు పతకాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ అండర్ 19 కార్యదర్శి పద్మావతి, సీనియర్ వ్యాయామ అధ్యాపకుడు చలపతిరావు, రైఫిల్ షూటింగ్ అకాడమీ శిక్షకులు రవి కుమార్ పాల్గొన్నారు.

మంత్రి సురేష్‌కు మాతృవియోగం

- జార్జి విద్యాసంస్థల చైర్‌పర్సన్ థెరీసమ్మ ఇకలేరు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాతృమూర్తి ఆదిమూలపు థెరీసమ్మ (85) సోమవారం కన్నుమూశారు. కొద్దిరోజులుగా హైదరాబాద్ లోని ఒక ప్రయివేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఆమె తెల్లవారుజామున 1:30 నిముషాలకు (తెల్లవారితే సోమవారం) తుదిశ్వాస విడిచారు. థెరీసమ్మకు ఐదుగురు సంతానం కాగా వారిలో ఇద్దరు కుమారులు డాక్టర్ ఆదిమూలపు సురేష్ రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నారు. రెండో కుమారుడు డాక్టర్ సతీష్ జార్జి విద్యాసంస్థల కార్యదర్శిగా ఉన్నారు.

ఉపాధ్యాయ వృత్తితో వేలాదిమంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దిన ఆమెతో పాటు భర్త డాక్టర్ శామ్యూల్ జార్జిలు అంచలంచెలుగా విద్యాసంస్థల అధినేతల వరకు ఎదిగి ప్రకాశం జిల్లాలో తొలి ఇంజనీరింగ్ కళాశాలను మార్కాపురంలో నెలకొలిపారు. డాక్టర్ శామ్యూల్ జార్జి పశ్చిమ ప్రాంత విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. థెరిసమ్మ మార్కాపురం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా పని చేశారు. ఈ పాఠశాల అభివృద్ధికి థెరిసమ్మ ఎనలేని కృషి చేశారు. ఉపాధ్యాయ వృత్తితో విశేష సేవలు అందించారు. అటు కర్నూలు జిల్లాలో, ఇటు ప్రకాశం జిల్లాలో విద్యాసంస్థలను నెలకొల్పి విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించి జిల్లాలో ఆదర్శంగా నిలిచారు. ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతంలో నర్సింగ్, బీఫార్మసీ, ఇంజనీరింగ్ విద్యను అందుబాటులోకి తీసుకువచ్చి ఎంతోమంది విద్యార్థుల విద్యాభివృద్ధిలో కీలకపాత్ర పోషించారు. డాక్టర్ శ్యామ్యూల్ జార్జి మృతి తర్వాత విద్యాసంస్థల చైర్పర్సన్‌గా థెరీసమ్మ ఇప్పటివరకు వ్యవహరిస్తున్నారు. గత కొద్దిరోజులుగా అనారోగ్యానికి గురైన ఆమె సోమవారం మృతి చెందారు. థెరిసమ్మ మృతితో అటు కర్నూలు ఇటు ప్రకాశం జిల్లాలో విషాద ఛాయలు అలమకున్నాయి.

పూర్తి నష్టపరిహారం చెల్లించాకే...

పరిశ్రమను స్వాధీనం చేసుకోవాలి

- సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పాత కార్బైడ్‌లో పనిచేస్తున్న కార్మికులకు పూర్తిస్థాయి నష్టపరిహారం చెల్లించిన తర్వాతే పరిశ్రమను స్వాధీనం చేసుకోవాలని విబిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గౌస్ దేశాయ్, కార్యదర్శి భాస్కర్ రెడ్డి, యూనియన్ నాయకులు లక్ష్మన్న ఆదిశేషన్న, సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం కార్మిక కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కర్నూలు మండలం దిన్నదేవరపాడు గ్రామపంచాయతీ పరిధిలో 1978 -79 సంవత్సరంలో వెనుకబడిన ప్రాంతాలను దృష్టిలో పెట్టుకుని ఆరు సూత్రాల పథకం కింద ఎపి కార్బైడ్ పరిశ్రమను స్థాపించారని వారు తెలిపారు. ఆరోజు 480 మంది కార్మికులు ఆ పరిశ్రమలో పనిచేశారని, ఈ పరిశ్రమ ఏర్పడడం వల్ల చాలామంది పేద ప్రజలకు ఉపాధి దొరికిందని వారు వివరించారు. కార్బైడ్ పరిశ్రమ విబిసి యాజమాన్యం తీసుకున్న తర్వాత 2013 వరకు మంచి ఉత్పత్తి సామర్థ్యంతో నడిచిందని, పరిశ్రమ లాభాలు గడించిందని తెలిపారు. ఈ పరిశ్రమ యాజమాన్యం బ్యాంకుకు తీసుకున్న అప్పుల సరిగా కట్టక పరిశ్రమను ఎన్‌సిఎల్‌టి కోర్టుకు వారు స్వాధీనం చేసుకున్నారు. కోర్టుకు వెళ్ళినప్పుడు కోర్టు ఏర్పాటు చేసిన ఆర్‌పి , సిఒసి కమిటీ వారు కామిని స్టీల్ కంపెనీ యాజమాన్యంతో కుమ్మక్కై కార్మికులకు ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకుండానే రూ.600 కోట్ల విలువగలిగే కంపెనీని కేవలం రూ.65 కోట్లు దక్కేలా చేయడం చాలా దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. దీనిపై పాత యాజమాన్యం సుప్రీంకోర్టులో అప్పీల్‌కు వెళ్ళింది. సుప్రీంకోర్టు ఈ పరిశ్రమను కొత్త యాజమాన్యం స్వాధీనం చేసుకోకుండా స్టైల్ తీసుకుని వచ్చింది. తమకే పరిశ్రమ వచ్చిందని కామిని స్టీల్ యాజమాన్యం కార్మికులకు నామమాత్రపు పరిహారం ఇచ్చి తిరిగి పరిశ్రమను ప్రారంభించి ఉపాధి కల్పిస్తామని నమ్మబలికి మోసం చేసిందన్నారు. కార్మికులకు ఏమాత్రం ముందస్తు నోటీసు లేకుండానే పరిశ్రమను డెమోలిష్ చేయాలని ప్రయత్నాన్ని ప్రారంభించడం దారుణమని వారు ఘాటుగా విమర్శించారు. ఈ పరిశ్రమకు సంబంధించిన ఆస్తులు అనేకచోట్ల ఉన్నాయని అవి అన్నీ కూడా ఈ పరిశ్రమ కార్మికుల కష్టం వల్ల తీసుకున్నవేనని తెలిపారు. ఇప్పటికీ పరిశ్రమ యాజమాన్యం కార్మికులకు 2012 నుండి 18 వరకు పిఎఫ్ ,ఇఎస్ఐ బకాయిలు కట్టలేదని రూ.నాలుగు కోట్ల 75 లక్షల పెండింగ్ ఉన్నాయని అవి కట్టకుండా ఏ రకంగా స్వాధీనం చేసుకుంటారని ప్రశ్నించారు. ఒకవైపు సుప్రీంకోర్టు ఇస్తే మరోవైపు కార్మికుల పెండింగ్ వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ బకాయిలు ఉండగా పరిశ్రమలో ఎటువంటి కార్యక్రమాలు చేయడానికి వీలు లేదని అలా చేస్తే కార్మికులు కచ్చితంగా అడ్డుకొని తీరుతారన్నారు. కోట్ల విలువ గల ఆస్తి కేవలం రూ.65 కోట్లకే కారుచౌకగా కొల్లగొట్టి కార్మికుల కడుపు కొట్టాలని చూస్తే కార్మికులు మౌనంగా చూస్తూ ఉండరని హెచ్చరించారు. అందుకోసం కొత్త యాజమాన్యం, పాత యాజమాన్యం పరిశ్రమను తిరిగి ప్రారంభించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అటు కాకపోతే కార్మికులకు , స్టాఫ్‌కు పూర్తిస్థాయి రావలసిన నష్టపరిహారం, పిఎఫ్, ఇఎస్ఐ బకాయిలు చెల్లించాలన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఇఇ రమేస్‌కు వినతిపత్రం ఇస్తున్న టి.రాముడు, నరసింహనాయుడు, సుమలత

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రజలకు భారం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలపై భారం పడుతుందని విద్యుత్ శాఖ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్‌కు సోమవారం సోమవారం వామపక్ష, టిడిపి పార్టీల నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు, టిడిపి కర్నూలు పార్లమెంట్ అధికార ప్రతినిధి నరసింహ నాయుడు, వెంకటేశ్వర్లు, రామచంద్రుడు, నాగరాజు, వడ్డే గురు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ సంఘం నగర అధ్యక్షురాలు మీసాల సుమలత ఉన్నారు. వారు మాట్లాడుతూ గృహ, వాణిజ్య ,పారిశ్రామిక శ్రామిక విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలన్న డిస్కాంట్ల ప్రతిపాదనాలకు జ్యాడిషియల్ ప్రివ్యూ కమిటీ ఆమోదం తెలపడం వల్ల వినియోగదారులపై భారం పడుతుం దన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం వల్ల నిర్వహణ పేరిట 10 సంవత్సరాలలో రూ.36 వేల కోట్ల భారం పడనుందన్నారు. 3 డిస్కాంట్ల పరిధిలోని 1.50 కోట్ల గహ వాణిజ్య పారిశ్రామిక విద్యుత్ కనెక్షన్లకు 2025 డిసెంబర్ నాటికి దశల వారీగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డిఎస్ఎస్ పథకాన్ని శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్ వినియోగ దారులకు భారం వేసే చర్యలు మానుకోవాలని కోరారు.

హాస్టళ్లలో మెస్, కాస్మొటిక్‌ఛార్జీలను పెంచాలి

ఎబివిపి రాష్ట్ర మహాసభ తీర్మానం

ప్రజాశక్తి కర్నూలు అగ్రికల్చర్

హాస్టల్ విద్యార్థులకు మార్కెట్ ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచాలని , ఉపధ్యాయ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, రాష్ట్రంలో ఉన్న ఖాళీలకు అనుగుణంగా ఎపిపిఎస్‌సి ద్వారా ఉద్యోగాలా జాబ్‌క్యాలెండర్ ప్రకటించాలని ఎబివిపి రాష్ట్ర మహాసభ తీర్మానం చేసిందని రాష్ట్ర కార్యదర్శి చంద్ర తెలిపారు. ఎబివిపి 41వ రాష్ట్ర మహాసభలు 23,24,25 తేదీలలో కర్నూలు నగరంలోని ఎ. క్యాంప్ మాంటిస్సోరి గ్రౌండ్స్‌లో నిర్వహించామని చెప్పారు. సోమవారం సెంట్రల్ ప్లాజాలోని ఎబివిపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ మహాసభల ద్వారా రాష్ట్రంలో ప్రజలు ,విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పైన 17 తీర్మానాలు చేశామన్నారు. స్టేట్ జాయింట్ సెక్రటరీ మహేష్, జిల్లా కన్వీనర్లు వీర బ్రహ్మం, మారుతి, మీడియా కన్వీనర్ పాండు, అఖిల్, మహేష్ పాల్గొన్నారు.



తీర్మానాల కాపీని చూపుతున్న ఎబివిపి నాయకులు

పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలి

ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయ రాజు

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్ ఎదుట టీచర్ల ధర్నా

రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లకు సంబందించిన పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయ రాజు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ అధ్యక్షతన ధర్నాలో పాల్గొన్న ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు హదయ రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులు నెల వారీగా దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్, ఎపి జియల్ ఐ క్లెయిమ్స్, లోన్స్ బకాయి 16 వందల కోట్లు, ఆర్జిత సెలవులను నగదు రూపంలో రావాల్సిన బకాయిలు 2 వేల కోట్లు, డిఎ బకాయిలతోపాటు సిపిఎస్ వారికి మంజూరు చేయాల్సిన బకాయిలు మెడికల్ రియంబర్స్‌మెంట్ బిల్లులు కూడా పెండింగులో ఉన్నాయన్నారు. పదవీ విరమణ పొందిన వారికి పెన్షన్స్, గ్రాట్యుటీ, కమ్యూటేషన్లు కలిపి దాదాపు రూ.20 వేల కోట్ల బకాయిలు వున్నాయని, వాటిని వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఉఫాద్యాయ వర్గాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. జీతాలు 12న చెల్లించకపోవడం, జీతాలకోసం రోడ్డు ఎక్కేలా చేస్తుందని అన్నారు. ప్రశ్నిస్తే కేసులు అక్రమ అరెస్టులతో తీవ్ర భయలండోనాలకు గురిచేస్తోందన్నారు. ఈ విధానాలు మానుకోవాలని లేకుంటే భవిష్యత్తులో తగిన గుణపాఠం చెప్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి ఐ.మరియానందం, రాష్ట్ర ఎన్నికల సభ్యులు టివి.రామకృష్ణ, కె.మద్దిలేటి కె.తిమ్మప్ప,శేషాచలం, శేషయ్య, జనార్దన్‌రెడ్డి, జి.శ్రీనివాసరెడ్డి, గఫ్ఫార్, సుబ్రమణ్య శర్మ, నరేంద్ర, స్వామినాథన్ జిల్లా కార్యవర్గ సభ్యులు శేషశయనారెడ్డి, మాలేఖన్ సురేష్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన : టిడిపి

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

నిరుపేదల పింఛన్లను ప్రభుత్వం అక్రమంగా తొలగిస్తుందని రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని టిడిపి పాణ్యం ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. సోమవారం పాణ్యం నియోజకవర్గం కల్లూరు మండలం యాపర్లపాడు, ఉలిందకొండ గ్రామాలలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలలో ఇంటింటికీ తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షుడు రామాంజనేయులు, మాజీ ఎంపిపి వాకిటి మాధవి, కల్లూరు మండల నాయకులు మాదేశ్, శేఖర్ చౌదరి, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు గంగాధర్ గౌడ్, ఉలిందకొండ నాయకులు ఈవి రమణ, శ్రీకాంత్, సుబ్బారాయుడు, కరీం, వేంకటేశ్వర్లు,దస్తగిరి నాయుడు, రంగ స్వామి రెడ్డి,కలాం,జిలానీ, షేక్ష, యాపర్లపాడు శివారెడ్డి, సుంకన్న, రామ నాయుడు, శాంసంగ్, సుధాకర్, బుజ్జి, దొడ్డిపాడు బాషా, లక్ష్మీపురం శేఖర్ కళ్యాణ్, బొల్లారం పివి రమణ రెడ్డి పాల్గొన్నారు

ఇదేంఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో టిడిపి నేతలు గౌరుచరిత

రాజకీయాలకతీతంగా సంక్షేమ ఫలాలు : ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్: రాజకీయాలకు అతీతంగా వైసిపి ప్రభుత్వం ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తోందని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ.హఫీజ్ ఖాన్ అన్నారు. కర్నూలు నగరంలోని పింజర వీధి 9వ వార్డ్ 23వ సచివాలయం పరిధిలో గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయనకు స్థానిక వార్డు నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంసమస్యలు తెలుసుకోవడానికేనని అన్నారు. ఎవరైనా అర్హత ఉండి సంక్షేమ పథకాలు రాకపోతే వారికీ ఇప్పించే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికి న్యాయం చేసినటువంటి ప్రభుత్వం వైసిపి అని అన్నారు. ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా నిలబెట్టిన ప్రభుత్వం మనదేనని, కోవిడ్ కష్టాలున్నా సరే చెప్పిన సమయానికి చెప్పిన కార్యక్రమం బటన్ నొక్కి మీ ఖాతాల్లో జమ చేసిన గొప్ప మనసున్న ప్రభుత్వం మనదని చెప్పారు. పుట్టిన పిల్లవాడి దగ్గర నుంచి పండు ముసలి వారి వరకు ఒక్కొక్కరికి ఒక్కో పథకం పెట్టి ప్రతి వయసు వారికీ కూడా ఆసరా కల్పించిందన్నారు. సంపూర్ణ పోషణ ప్లస్ పథకం ద్వారా అంగన్వాడీ కేంద్రాలలో భోజనాన్ని పరిశీలించి చూస్తే గత ప్రభుత్వానికి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి తేడా ఏంటో మీకు తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు 9వ వార్డ్ కార్పొరేటర్ పుల్లమ్మ, నవీన్, రశేఖర్, మజీద్ ఖాన్, తబ్రేజ్ ఖాన్, జావీద్, అబిద్, ఎల్లేష్, షాకీర్, మెహబూబ్, గోవింద్ రాజులు, అబ్దుల్లా, పీనూర్ అహ్మద్, బీడీ సలాం, అబ్దుల్ రెహమాన్, ఇర్ఫాన్ చావుస్, సలీం స్థానిక వార్డ్ నాయకులు మెప్మా ఆర్‌పి సచివాలయం సిబ్బంది విద్యుత్ సిబ్బంది మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే .హాఫీజ్ ఖాన్

పోలీస్ స్పందనకు 66 ఫిర్యాదులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి మొత్తం 66 ఫిర్యాదులు అందాయని అడిషనల్ ఎస్పీ అడ్మిన్ డి.ప్రసాద్ తెలిపారు.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని : ఓర్వకల్లు ఎయిర్ పోర్టులో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి డబ్బులు తీసుకొని మోసం చేశారని బేతం చేర్లకు చెందిన మహబూబ్‌బాషా ఫిర్యాదు చేశారు. భర్త హింసిస్తున్నాడని ఆదోనికి చెందిన ఒక మహిళ ఫిర్యాదు చేశారు. మా పొలంలో అక్రమంగా వచ్చి కొందరు వ్యక్తులు దాడి చేస్తున్నారని జి.సింగవరంకు చెందిన చిన్న నాగన్న ఫిర్యాదు చేశారు. మొబైల్ క్యాంటిన్ వాహనాన్ని కిరాయికి తీసుకెళ్ళి ఒక నెల కిరాయి ఇచ్చి నమ్మించి మొబైల్ క్యాంటిన్ వాహనాన్ని తీసుకెళ్ళాడని కర్నూలుకు చెందిన షాఉద్దీన్ ఫిర్యాదు చేశారు. తదితర మొత్తం 66 ఫిర్యాదులు వచ్చాయి. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు ఉన్నారు.

మహిళల చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు లీగల్ :

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు , జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.శ్రీనివాస రావు ఆదేశాలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సిహెచ్.వెంకటనాగ శ్రీనివాసరావు సోమవారం కర్నూలు లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో న్యాయ సేవాధికార సంస్థ సిహెచ్.వెంకట నాగ శ్రీనివాస రావు మహిళలకు సంబందించిన చట్టాలను, ఉచిత న్యాయ సహాయం గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు , కక్షిదారులు పాల్గొనారు.

28న జాబ్ మేళా

కర్నూలు కలెక్టరేట్: ఈ నెల 28న బుధవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా అభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్ రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు బయోడేటా, సర్టిఫికేట్లతో ఇంటర్వ్యూకు కర్నూలు జిల్లా బి.తాండ్రపాడు గవర్నమెంట్ పాలిటెక్నిక్ మైనారిటీ కళాశాలలో హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 7981682826, 9059290821 నంబర్లను సంప్రదించలన్నారు.

ఎంఆర్‌పికే ఎరువులు, మందులు విక్రయించాలి : ఎఒ

ప్రజాశక్తి- సి బెళగల్

ఎరువులను,మందులను ఎంఆర్‌పి ధరలకే విక్రయించాలని ఎఒ మల్లేష్‌కుమార్ దుకాణ దారులకు హెచ్చరించారు. సోమవారం బెళగల్‌లో బిస్మిల్లా, మన గ్రోమోర్, మదీనా, తదితర దుకాణాలను తనిఖీ చేశారు. స్టాకును, రికార్డులను, ధరల పట్టికను పరిశీలించి ఎరువులు, మందుల నమూనాలను సేకరించారు. క్రయ విక్రయాల్లో రికార్డులు తప్పనిసరిగా నమోదు చేయాలని, ఎంఆర్‌పి ధరలను అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైసిపిదే విజయం

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో వైసిపి విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు ఈరమ్మ విక్టరీపేటలో, తారాబాయి ఎన్‌జిఒ కాలనీలో, భాగ్యలక్ష్మి చందస దర్గాలో, సుజాత శక్తి గుడిలో ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని పార్టీలూ ఏకమైనా జగన్ ప్రభంజనం ముందు ఎవరూ నిలవరన్నారు. రాష్ట్ర బ్రాహ్మణ, అర్చక, పురోహిత సంఘం రాష్ట్ర కన్వీనర్ మధుసూదన్ శర్మ, వైసిపి పట్టణాధ్యక్షులు దేవా, సీనియర్ నాయకులు గోపాల్‌రెడ్డి, ఐసిడిఎస్ అధికారి ఉమా మహేశ్వరి, శంకరాచార్య పాల్గొన్నారు.

పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

అర్జీలను గడువులోపు పరిష్కరించాలి

- ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

స్పందనలో లబ్ధిదారుల నుంచి స్వీకరించిన అర్జీలను గడువులోపు పరిష్కరించాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో డివిజన్ పరిధిలోని ఆయా ప్రాంతాల లబ్ధిదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాధితులు అడిగిన సమస్యకు అర్థమయ్యే విధంగా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని తెలిపారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తే బియాండ్ ఎస్ఎల్ఎ అర్జీలు ఉండవన్నారు. అర్జీదారులను పదే పదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా సమస్య పరిష్కారం అవుతుందా లేదా స్పష్టంగా అర్జీదారునికి అర్థమయ్యే విధంగా వివరించాలని చెప్పారు. పరిపాలన అధికారి గోవిందు సింగ్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీరామ్ మోహన్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, ఎఒ పాపిరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ రమాదేవి, ఎస్‌డబ్ల్యుఒ సుధాకర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయరాం రెడ్డి పాల్గొన్నారు.

అర్జీలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్

ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని రాంపురం గ్రామంలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సోమవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం, నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్లు కట్టించి ఇస్తున్నట్లు తెలిపారు. హౌసింగ్ డిఇ లాల్ కృష్ణయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ హర్ష పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

పరిసరాల పరిశుభ్రతకు చర్యలు

-కౌన్సిలర్ పార్వతి

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని 1వ వార్డు పరిధిలోని ప్రాంతాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామని వార్డు కౌన్సిలర్ పార్వతి, టిడిపి వార్డు ఇన్‌ఛార్జీ వెంకటేష్ తెలిపారు. సోమవారం వాల్మీకి నగర్‌లోని పబ్లిక్ టాయిలెట్ ట్యాంకు లీకేజీ మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వార్డులోని వాల్మీకి నగర్, ప్రశాంత్ నగర్, వీరభద్ర స్వామి దేవాలయం ఏరియా ప్రాంతాల్లోని వీధులు పరిశుభ్రంగా ఉండేలా నిత్యం పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. వాల్మీకి నగర్‌లో కొంతకాలంగా టాయిలెట్ సెప్టిక్ ట్యాంకు నిండి ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా ఉండేదన్నారు. మహిళలు ఇబ్బందులు పడేవారన్నారు. సమస్యను మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ట్యాంకు శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. వార్డులో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ ఏర్పాటు చేసి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ పార్వతి

వరి గడ్డికి భలే డిమాండ్..!

- ట్రాక్టర్ రూ.13 వేల నుంచి రూ.15 వేలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పశువులకు మేతగా వాడే వరి గడ్డికి భలే డిమాండ్ ఏర్పడింది. ట్రాక్టర్ వరి గడ్డి రూ.13 వేల నుంచి రూ.15 వేలు పలుకుతోంది. ఆదోని మండలంలో వర్షాధార పంటలుగా ఎక్కువగా పత్తి, మిరప, కందిని సాగు చేయడంతో పశుగ్రాసం దొరకడం కష్టంగా మారింది. వర్షాకాలం వచ్చే వరకు పశుగ్రాసం నిల్వ చేసుకోవాల్సి ఉండడంతో పశువుల యజమానులు వరి గడ్డిపై ఆసక్తి చూపుతున్నారు. మండల సరిహద్దులో వరి గడ్డి ఎక్కువగా దొరకకపోవడంతో కర్ణాటక రాష్ట్రానికి చెందిన వరి సాగు రైతులు ట్రాక్టర్లలో గడ్డిని తీసుకొచ్చి మండలంలో విక్రయాలు జరుపుతున్నారు. కర్ణాటక నుంచి దూరంగా ఉన్న గ్రామాలకు అయితే మరింత అదనపు ధర డిమాండ్ చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలో శిరుగుప్ప, రాయచూర్, యాడికి తదితర ప్రాంతాల నుంచి వరి గడ్డి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు.

పెరిగిన డిమాండ్ : గతంలో వరిని కూలీలే కొడవళ్లతో కోసి, కట్టలు కట్టి పంట నూర్చేవారు. గడ్డిని మోపులుగా కట్టి పశువుల దాణాగా ఉపయోగించే వారు. పొలం కోసే దగ్గర నుంచి, గడ్డి కట్టలు వామి వేసేలోపు 10 నుంచి 15 రోజుల సమయం పట్టేది. ఆ గడ్డిని పశువులు ఇష్టంగా తినేవి. తర్వాత కాలంలో వరి కోత యంత్రాలు వచ్చాయి. కొద్ది తేడాతోనే హార్వెస్టర్లు కోసిన గడ్డిని కట్టలు కట్టే యంత్రాలు కూడా వచ్చాయి. హార్వెస్టర్ ద్వారా కోసిన గడ్డిని పశువులు ఇష్టంగా తినడం లేదని పొలాల్లోనే వదిలేసేవారు. కొందరు రైతులు గడ్డి ఎండిన తర్వాత, పొలంలోనే నిప్పు పెట్టేవారు. పశువులకు గడ్డి అవసరమై ఎవరైనా కావాలంటే, ఉచితంగానే తీసుకెళ్లమని చెప్పేవారు. మూడు, నాలుగేళ్ల క్రితం ఈ పరిస్థితి ఉండేది. రెండేళ్ల నుంచి రైతులకు గడ్డి కట్టకు రూ.20 చొప్పున, మరో రూ.20 చొప్పున కూలీలకు ఇచ్చి కట్టలు కట్టించుకొని తీసుకెళ్లేవారు. ఇప్పుడు అదే హార్వెస్టర్లతో కోసిన గడ్డిని రూ.80 చొప్పున రైతుకు, కట్టలు కట్టినందుకు మరో రూ.20 చెల్లించి కొనుక్కునే పరిస్థితి ఏర్పడింది.

ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న వరి గడ్డి

జాతీయ స్థాయి పోటీలకు 'నారాయణ' విద్యార్థి

ప్రజాశక్తి-కోసిగి రూరల్

కోసిగి నారాయణ డిగ్రీ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థి రమేష్ జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. మంత్రాలయం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన నరసయ్య, హనుమంతమ్మ దంపతుల కుమారుడు రమేష్ 6వ తరగతి నుంచి కోసిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు)లో విద్యనభ్యసిస్తూ ఆటల్లో చురుకుగా పాల్గొంటున్నారు. పీడీ ఖలీల్ అహ్మద్ ప్రోత్సాహంతో ఖోఖోలో చిన్న వయసులోనే ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. 9వ తరగతి చదువుతున్న సమయంలో 2017లో అండర్-14 విభాగంలో జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అలాగే ఈనెల 9 నుంచి 12 వరకు ఆంధ్రప్రదేశ్ ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 26 నుంచి 30 వరకు పశ్చిమబెంగాల్ రాష్ట్రం హుగ్లీ జిల్లాలో జరిగే జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొననున్నారు. సోమవారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కోసిగి నారాయణ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ హుస్సేనయ్య, డైరెక్టర్ చౌడయ్య, ప్రిన్సిపల్ షేక్షావలీ, వైస్ ప్రిన్సిపల్ బాలాజీ, అధ్యాపకులు కాడయ్య, ఇస్మాయిల్ రమేష్‌కు అభినందనలు తెలిపారు. క్రీడల్లో తమ కళాశాలకు గుర్తింపు తీసుకొస్తున్న ఫిజికల్ డైరెక్టర్ బాలకృష్ణను ప్రత్యేకంగా అభినందించారు. రమేష్ ఎంపికలో కర్నూలు జిల్లా ఖోఖో అసోసియేషన్ కోశాధికారి ఖలీల్ అహ్మద్ కృషి వెలకట్టలేనిదన్నారు. ఇటీవల కాలంలో కోసిగి గ్రామం నుంచి ప్రతిభ గల క్రీడాకారులను కర్నూలు జిల్లా ఖో ఖో అసోసియేషన్ అందిస్తున్నందుకు ఖలీల్ అహ్మద్‌కు కర్నూలు జిల్లా ఖో ఖో అసోసియేషన్ అధ్యక్షులు శంకర్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే చొరవతో ఐరనగల్లు అభివృద్ధి

- వైసిపి మండల ఇన్‌ఛార్జీ మురళీమోహన్ రెడ్డి

ప్రజాశక్తి-కోసిగి రూరల్

ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి ప్రత్యేక చొరవతో ఐరనగల్లు గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని వైసిపి మండల ఇన్‌ఛార్జీ మురళీ మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని ఐరనగల్లు గ్రామంలో ఎమ్మెల్యే బాలనాగి రెడ్డి ఆదేశాల మేరకు, ఎమ్మెల్యే ప్రత్యేక నిధులు రూ.5 లక్షలతో ఆంజనేయ స్వామి దేవాలయం దగ్గర నుంచి సిసి రోడ్డు ఏర్పాటుకు భూమిపూజ చేశారు. మండల నాయకులు, ఎల్ఎల్‌సి డిస్ట్రిబ్యూటర్ మాజీ ప్రెసిడెంట్ శ్రీనివాస రెడ్డితో కలిసి మురళీ మోహన్ రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2019లో రూ.10 లక్షలతో, 2021లో రూ.9 లక్షలతో ఇరువైపులా డ్రెయినేజీతో పాటు సిసి రోడ్లు వేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే బాలనాగి రెడ్డి ప్రత్యేక నిధులతో గ్రామస్తులకు సురక్షిత తాగునీరు అందించేందుకు ఆర్ఒ ప్లాంట్, 1550 ఎకరాలకు సాగునీరు అందించేందుకు దాదాపు రూ.20 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు మంజూరు చేసినట్లు చెప్పారు. పిఆర్ ఎఇ యుగంధర్ రెడ్డి, భీమసేన, టి.ఈరన్న, శ్రీరాములు, నారాయణ, సుందరరాజు, సురేంద్ర, దావీదు, ఇజ్రాయిల్, ఆళ్లప్ప, వీరేష్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ముఖ్యఅతిథులను సన్మానిస్తున్న నాయకులు

సంక్షేమ పథకాలే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం

ప్రజాశక్తి- హొళగుంద

సంక్షేమ పథకాలే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని, రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం తెలిపారు. సోమవారం 'గడపగడపకు మన ప్రభుత్వం'లో భాగంగా మండలంలోని గజ్జహళ్లి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రయివేట్‌కు దీటుగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలు ఉండాలన్నదే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సంకల్పమని తెలిపారు. అందులో భాగంగానే నాడు-నేడు ద్వారా అదనపు గదుల నిర్మాణం, పాఠశాల చుట్టూ ప్రహరీ, ప్రతి విద్యార్థికి బట్టలు, బూట్లు, పాఠ్యపుస్తకాలతో పాటు నోటు బుక్కులు కూడా అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తెలిపారు. అనంతరం గడపగడపకు తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. వైసిపి ఆలూరు తాలూకా ఇన్‌ఛార్జీ నారాయణస్వామి, ఎంపిడిఒ దాసు నాయక్, ఆలూరు మండల కన్వీనర్ వీరేష్, హొళగుంద మండల కన్వీనర్ షఫీవుల్లా, ఎంపిపి తనయుడు ఈశా, జడ్‌పి వైస్ ఛైర్మన్ బావ శేషప్ప, వైసిపి నాయకులు కించప్ప, గిరిమల, రామకృష్ణ, కుమార్ స్వామి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం

వసతి కల్పనలో ఇబ్బందులు

- శ్రీమఠం మేనేజర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మంత్రాలయం

క్రిస్మస్ సెలవులు, వైకుంఠ ఏకాదశి, జనవరి 1 సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చే అవకాశం ఉందని, వసతి గృహాలు ఏర్పాటు చేయడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే చాలా మంది ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్నారని తెలిపారు. గత 3, 4 రోజులుగా, గదుల కేటాయింపు కోసం ప్రొటోకాల్ నిబంధనల ప్రకారం భక్తులు, వివిఐపిల రద్దీని చూస్తున్నామని చెప్పారు. గదుల కేటాయింపు కోసం దాతల నుంచి దాతల కూపన్లను స్వీకరిస్తున్నామని, దాతలకు వారు కూపన్లు ఇచ్చి పంపిన భక్తులకు కూడా కేటాయించాల్సి ఉందని తెలిపారు. సాధారణ ప్రజల నుంచి ఆఫ్‌లైన్ బుకింగ్‌ను కూడా జాగ్రత్తగా చూసుకోవాలని పేర్కొన్నారు. పైన పేర్కొన్న తేదీల్లో గదులను రిజర్వ్ చేయడానికి, కేటాయించడానికి ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. భక్తుల నుంచి చివరి గంట అభ్యర్థనలు, సిఫార్సు లేఖల శ్రేణిని అధిగమించలేక పోతున్నామని చెప్పారు. ఆచరణాత్మక సమస్యను ఎదుర్కొంటామని, ఈ విషయాన్ని భక్తులతో పాటు సిఫార్సులు చేసేవారు గమనించి సహకరించాలని కోరారు.

వైసిపి నూతన సంవత్సర కానుక

- పింఛన్లు కట్

- టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

కొత్త ఏడాదిలోకి అడుగు పెడుతున్న వేళ పేదలకు, వృద్ధులకు నూతన సంవత్సర కానుకగా రాష్ట్రవ్యాప్తంగా 6 లక్షల మందికి పింఛను కట్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చూస్తోందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు తెలిపారు. సోమవారం ఆయన ఆదోనిలో విలేకరులతో మాట్లాడారు. గతంలో చంద్రబాబు నాయుడు రూ.1000 నుంచి రూ.2 వేలు పెంచినా ఎలాంటి తొలగింపులకు పాల్పడలేదన్నారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో ఎవరికీ, ఎలాంటి సమస్యలు ఉండకూడదంటే చంద్రబాబు నాయుడును గెలిపించుకోవాలని కోరారు. టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ప్రచార ప్రతినిధి తిమ్మప్ప ఉన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి : ఎఒ

ప్రజాశక్తి - చిప్పగిరి

పంటలు సాగు చేసిన ప్రతి రైతూ ఈకేవైసీలో పేరు నమోదు చేసుకోవాలని, నమోదు చేసుకుంటే పిఎం కిసాన్ డబ్బులు వర్తిస్తాయని ఎఒ ఆనంద్ తెలిపారు. సోమవారం చిప్పగిరి వ్యవసాయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జనవరిలో పిఎం కిసాన్ డబ్బులు వర్తించాలంటే డిసెంబర్ చివరి నాటికి ఈకేవైసీ యాప్‌లో రైతు పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రతి రైతూ అశ్రద్ధ చేయకుండా దగ్గరలో ఉన్న రైతు భరోసా కేంద్రాల అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను సంప్రదించి ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

ద్విచక్ర వాహనాల ప్రమాదంలో...
మరో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కౌతాళం

ద్విచక్ర వాహనాల ప్రమాదంలో మరో వ్యక్తి మృతి చెందారు. గత మంగళవారం కర్ణాటకలోని సిరుగుప్ప తాలూకా కుడరహాలు గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. కౌతాళం మండలం ఉరుకుంద గ్రామానికి చెందిన తిప్పలదొడ్డి ఈరన్న అక్కడికక్కడే మృతి చెందారు. కౌతాళం గ్రామానికి చెందిన మరో ఇద్దరు గాయాలతో బళ్లారి ఆస్పత్రిలో చికిత్స పొందారు. వీరిలో రాఘవేంద్ర (రాగప్ప) చికిత్స పొందుతూ గత బుధవారం మృతి చెందారు. మరో వ్యక్తి మారుతి బాబు ఆదివారం రాత్రి మృతి చెందారు. బళ్లారి ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి సోమవారం మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు రోధిస్తున్న తీరు ప్రతి ఒక్కరిని కంటతడి పెట్టించింది. ఒకే రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు చనిపోయిన సంఘటనతో మండలంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ప్రమాద సంఘటనతో మూడు కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయాయి. వీరి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్‌లో విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - పెద్దకడబూరు

క్రాస్‌కంట్రీ రాష్ట్రస్థాయి పోటీల్లో మండలంలోని చిన్నతుంబలం విద్యార్థి ప్రతిభ చాటారు. సోమవారం పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.చామంతి మాట్లాడారు. ఈనెల 24న ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రాస్ కంట్రీ రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రకాశం జిల్లా చిన్నగంజాం మండలం కడవకుదురు జడ్‌పి హైస్కూల్‌లో నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో చిన్నతుంబలం జడ్‌పిహెచ్ స్కూల్ పదో తరగతి విద్యార్థిని కె.లక్ష్మి అండర్-18 విభాగంలో 4కె రన్‌లో పాల్గొని ఐదో స్థానంలో నిలిచినట్లు చెప్పారు. విద్యార్థికి సర్టిఫికెట్ అందజేసినట్లు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారాయుడు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థిని అభినందిస్తున్న సిబ్బంది

ప్రజా సమస్యల గొంతుక ప్రజాశక్తి

- జడ్‌పిటిసి విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాశక్తి గొంతుక అవుతోందని జడ్‌పిటిసి బి.విరుపాక్షి తెలిపారు. సోమవారం ఆయన స్వగ్రామంలో ప్రజాశక్తి 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజాశక్తి దినపత్రిక నిజాలను నిర్భయంగా రాస్తూ దిన్నదినాభివృద్ధి చెందుతోందని తెలిపారు. రైతులు, కార్మికులు, అణగారిన వర్గాల సమస్యలపై కథనాలు రాస్తూ వాస్తవాలను చూపెడుతోందని చెప్పారు. వైసిపి నాయకులు నాగప్ప, ప్రజాశక్తి ఆదోని ఇన్‌ఛార్జీ చంద్రశేఖర్, చిప్పగిరి, ఆలూరు, ఆస్పరి, హాలహర్వి మండలాల విలేకరులు రవి, కృష్ణ, మురళీ, వీరభద్ర గౌడ్ పాల్గొన్నారు.

చిప్పగిరిలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జడ్‌పిటిసి

ఆస్పరి : నిజాలను నిర్భయంగా రాస్తూ ప్రజాశక్తి ప్రజా విశ్వాసం పొందిందని సొసైటీ ఛైర్మన్ కట్టెల గోవర్ధన్ తెలిపారు. సొసైటీ కార్యాలయంలో నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ప్రజాశక్తి ఆదోని ఇన్‌ఛార్జీ చంద్రశేఖర్, సొసైటీ సిఇఒ అశోక్ కుమార్, విలేకరి మురళీ, వైసిపి నాయకులు తిమ్మప్ప, లక్ష్మణ్, ప్రకాష్, సొసైటీ సిబ్బంది నరసింహులు, హనుమంతు రెడ్డి, సుధాకర్, నారాయణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆస్పరిలో క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న సొసైటీ ఛైర్మన్ గోవర్ధన్

100కు పైగా గొర్రెలు మృతి

- రూ.15 లక్షల నష్టం

ప్రజాశక్తి - హొళగుంద

మండలంలోని గజ్జెహళ్లి గ్రామం సమీపంలో ఉన్న కాలువలో పడి వందకు పైగా గొర్రెలు మృతి చెందాయి. ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామ సమీప పొలాల్లో గొర్రెలు కాస్తున్న సమయంలో ఎల్ఎల్‌సి కాలువకు సంబంధించిన 63వ డిపో కాలువను దాటేందుకు వెళ్లి కాలువలో ఇరుక్కుని మృతి చెందినట్లు బాధితులు వాశప్ప, సిద్ధప్ప, ముంజప్ప వాపోయారు. వీరి స్వస్థలం కర్ణాటకలోని బెళగాం జిల్లా నిప్పణ తాలూకా సౌందొలగా గ్రామం. వీరు గ్రామం నుంచి ఆరు నెలల క్రితం మూగ జీవాలను మేపేందుకు వలస వచ్చారు. మృతి చెందిన గొర్రెల విలువ సుమారు రూ.15 లక్షలు ఉంటుందని వారు కన్నీటి పర్యంతమయ్యారు.

వాపోతున్న గొర్రెల యజమానులు

పేదల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మద్దిలేటి శెట్టి

ప్రజాశక్తి - దేవనకొండ

పేదల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సిపిఐ పార్టీ నిరంతర పోరాటాలు కొనసాగిస్తోందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.మద్దిలేటి శెట్టి, మండల కార్యదర్శి నరసారావు తెలిపారు. సోమవారం సిపిఐ కార్యాలయంలో సిపిఐ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సిపిఐ పట్టణ కార్యదర్శి నెట్టేకల్ అధ్యక్షత వహించారు. సిపిఐ సీనియర్ నాయకులు పూజారి ప్రసాద్ జెండాను ఆవిష్కరించారు. సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి వి.రాజశేఖర్, ఎఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి కె.భాస్కర్, జిల్లా నాయకులు మనోజ్, సిపిఐ మండల నాయకులు బాలాజీ, బజారి, నర్సోజి, అశ్వత్థామ, అబ్బాస్, రామన్న, బాష, రామాంజి, వెంకట్రాముడు, సుభాన్, శివలింగ పాల్గొన్నారు.

ప్రభుత్వ అసమర్థతతోనే ప్రజలకు కష్టాలు

- టిడిపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి వెంకటపతి రాజు

ప్రజాశక్తి - కౌతాళం

ప్రభుత్వ అసమర్థతతోనే రాష్ట్రంలోని ప్రజలకు కష్టాలు ఏర్పడ్డాయని టిడిపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి, క్లస్టర్ ఇన్‌ఛార్జీ వెంకటపతి రాజు తెలిపారు. సోమవారం కౌతాళంలోని తలారి గేరిలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వనరులు ఉన్నా సంపదను సృష్టించడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచి రాష్ట్ర ప్రజలపై భారం మోపడం తగదన్నారు. గ్రామంలో కనుచూపు మేరలో కూడా అభివృద్ధి కనబడడం లేదన్నారు. అభివృద్ధి చేయలేని పాలకులు అధికారం నుంచి తప్పుకోవాలని తెలిపారు. అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. జగన్ మూడేళ్ల పాలనలో ప్రజలు విసుగు చెంది మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో టిడిపి అధికారంలో వస్తుందన్నారు. అప్పుడు ప్రజల కష్టాలన్నీ తీరతాయని అన్నారు. రాజానందు, గొట్టయ్య పాల్గొన్నారు.


సమస్యలను వివరిస్తున్న వెంకటపతి రాజు

ఇష్టారాజ్యంగా గుంతలు

- పట్టించుకోని పంచాయతీ సెక్రటరీ, సర్పంచి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని చిన్న తుంబలం గ్రామంలోని పంచాయతీ స్థలంలో డ్రెయినేజీ నిర్మించేందుకు ఇష్టారాజ్యంగా గుంతలు తవ్వుతున్నారు. ఈ తవ్విన గుంతల్లో పంచాయతీ పైపు లైన్ వెళ్లింది. గుంతలు తవ్వే సమయంలో పైపునకు తగిలి పగులుతోందని గ్రామస్తులు చెప్పినా పట్టించుకోలేదు. పంచాయతీ సెక్రటరీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. గ్రామంలో ఆర్ఎంపి వైద్యులు ఖలీల్ కొత్త ఇంటిని నిర్మిస్తున్నారు. ఆయన మురుగుదొడ్డి కోసం గుంతలు తవ్వారు. అలా తవ్విన స్థలం సిసి రోడ్డు, అక్కడే పంచాయతీ పైపు లైన్ ఉంది. ప్రజలు వారించినా, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ అక్కడికి వెళ్లి చెప్పినా పట్టిచుకోకుండా గుంత తవ్వారు. గ్రామంలో ఉన్న రాజకీయ నాయకుల అండతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజలు వెళ్లి అడిగితే 'ఎవడు వస్తాడో.. రమ్మను. వాడి కథ చూస్తాన'ని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు వాపోతున్నారు. సర్పంచి, పంచాయతీ సెక్రటరీ, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇష్టారాజ్యంగా తవ్విన గుంతలు

తాగునీరందించడంలో వైసిపి విఫలం

- ఎస్ఎస్ ట్యాంకును పరిశీలించిన జనసేన నాయకులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు తాగునీరందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని జనసేన నాయకులు విమర్శించారు. సోమవారం మండలంలోని కుప్పగల్లు సమ్మర్ స్టోరేజీ ట్యాంకును జనసేన బృందం పరిశీలించారు. మండల నాయకులు ఎం.తాహేర్ వలీ, నాయకులు నాగరాజు, వీరేష్ మాట్లాడారు. మండలంలోని కుప్పగల్లు, బల్లెకల్లు, పాండవగల్లు, జాలమంచి, గణేకల్లు, ఇస్వి గ్రామాలకు రోజూ కుప్పగల్లు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి సురక్షిత మంచినీరు సరఫరా కావాల్సి ఉందని తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, గుత్తేదారుల నిర్లక్ష్యం వల్ల వారానికి రెండు, మూడు సార్లు మోటార్ కాలిపోయిందని, పైపులు పగిలిపోయాయని తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. జనసేన కార్యకర్తలు గణేష్, వీరేష్, తిక్కయ్య, తిమ్మప్ప, రామ్ రెడ్డి, ఈరన్న, పవన్, రవి, రమేష్, ప్రవీణ్, హనుమంతు, అశోక్, వెంకటేష్, వీరేష్, నరసప్ప, కంగారు ఈరన్న, రామిరెడ్డి పాల్గొన్నారు.

పోటాపోటీగా పవర్ లిఫ్టింగ్ పోటీలు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని జపాలి జిమ్‌లో ఆదోని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పవర్ లిఫ్టింగ్ (బెంచి ప్రెస్) పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్ కామాక్షి తిమ్మప్ప, అసోసియేషన్ ఛైర్మన్ కునిగిరి నీలకంఠ హాజరయి ప్రారంభించారు. ఈ పోటీల్లో క్రీడాకారులు పోటాపోటీగా బరువులు ఎత్తి ప్రతిభ చాటారు. పోటీలో స్ట్రాంగ్ మ్యాన్ అవార్డును క్రీడాకారుడు ముని సొంతం చేసుకోగా, వెంకటేష్ డెడ్ లిఫ్ట్ పోటీలో 205 కిలోల బరువు ఎత్తి ప్రతిభ చాటారు. జనవరి 4న వైజాగ్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు 8 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. కునిగిరి నీలకంఠ మాట్లాడారు. ఆదోనిలో క్రీడాకారులకు సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీ సాకారే శ్రీనివాసులు, సతీష్ నాయుడు, కారదర్శి హనుమంతు, రామానాయుడు, మంజునాథ్, రవీంద్ర పాల్గొన్నారు.


ప్రతిభావంతులను అభినందిస్తున్న కునిగిరి నీలకంఠ

2023 క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

వర్క్ఆర్ట్, పిఇటి అసోసియేషన్ 2023 క్యాలెండర్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.ఓంకార్ యాదవ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నారాయణ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ రాష్ట్ర కౌన్సిలర్ గోవింద్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓంకార్ యాదవ్ మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పార్ట్ టైం ఇన్‌స్పెక్టర్లందరికీ మినిమం టైం స్కేల్ కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న జీవి నారాయణ రెడ్డికి పిఇటి అసోసియేషన్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు షేక్ కల్చర్ ఉసేన్ అన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా నాయకులు నర్సప్ప శ్రీధర్‌రెడ్డి గిడ్డయ్య , కర్నూలు , నంద్యాల పిఇటి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కైసర్ హుస్సేన్ మాదన్న, రంగన్న లు పాల్గొన్నారు.

వినతులను స్వీకరిస్తున్న కర్నూలు కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్

స్పందన వినతులను వెంటనే పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

స్పందన కార్యక్రమంలో వచ్చిన వినతులను పరిశీలించి వెంటనే పరిష్కరిస్తామని కర్నూలు నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ శేషాసాయి అన్నారు. కర్నూలు మున్సిపల్ హాల్‌లో సోమవారం స్పందన లో వినతులు స్వీకరించారు. ప్రధానంగా రిచ్మండ్ విల్లాస్ కాలనీకి చెందిన సుకుమార్ ,ఇతరులు, మురుగు నీటిని సేకరించే ఉద్దేశ్యంతో అధికారులు పలు కాలనీలను అనుసంధానం చేస్తూ ఇప్పుడు పెద్ద కాలువను నిర్మించనున్నారని, దాని నిర్వహణ శ్రమతో కూడుకున్నదని, పైగా అంతటి పెద్ద కాలువ వలన ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉన్నందున, ప్రత్యామ్నాయ డిజైన్ కొరకు ఒకసారి పునఃపరిశీలించాలని కోరారు.బాలాజీ నగర్ , వీనస్ కాలనీ వాసులు మహమ్మద్ మియా , ఇతరులు, బాలాజీ నగర్ నుండి వీనస్ కాలనీ మీదుగా గతంలో అధికారులు మార్కింగ్ వేసిన 40 అడుగుల రోడ్డును ఇంకనూ నిర్మించలేదని, అందువలన రోడ్డు నిర్మాణము చేసే దిశగా చర్యలు చేపట్టాలని అభ్యర్థించారు. వీకర్ సెక్షన్ కాలనీ కి చెందిన ఆంజ నేయులు, తాము గతంలో టీడ్కో గృహానికి ప్రభుత్వ నిర్ణీత రుసుం ను చెల్లించామని, గృహం మంజూరు అవ్వనందున, తమ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా, తాము చెల్లించిన రుసుం తమకు తిరిగి ఇప్పించాలని కోరారు. శ్రీశైలం దేవస్థానం ఎంప్లాయిస్ కాలనీ కి చెందిన ప్రకాష్ బాబు ,ఇత రులు , తమ ప్లాట్లకు ఉత్తర దిక్కున ఉన్న కొన్ని కాలనీల నుంచి మురుగు నీరు, సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవటం చేత, తమ ఖాళీ ప్లాట్లలో నీరు నిలిచి అనారోగ్య సమస్యలకు కారణమ వుతుందని తెలిపారు. ఆయా కాలనీల నుంచి వచ్చిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. మేనేజర్ చిన్నరాముడు , టిపిఎస్ శబరీష్ , సిబ్బంది ఉమేష్ , వెంకటేష్ పాల్గొన్నారు.

రాయల్టీ విషయం సిఎం దృష్టికి తీసుకెళ్తాం

175 స్థానాలను కైవసం చేసుకునేందుకు ఐక్యత అవసరం
- బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో 175 స్థానాలను కైవసం చేసుకునేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య ఐక్యత అవసరమని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. రాయల్టీపై వున్న జిఎస్‌టిని 18 శాతం నుంచి తాను ఐదు శాతంకు తీసుకువచ్చామని, రాయల్టీ విషయంలో కూడా వైయస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. సోమవారం కొలిమిగుండ్లలోని వైసిపి కార్యాలయంలో మండల కన్వీనర్ అంబటి గురువురెడ్డి ఆధ్వర్యంలో వాలంటీర్లు, వైసిపి కన్వీనర్లకు అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిశీలకులు, మాజీ మంత్రి రామసుబ్బారెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు అబ్దుల్ ఖాన్, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతు కొలిమిగుండ్ల, బనగానపల్లె, అవుకు మండలాల్లో మైనింగ్ మీద ఆధారపడి ఎన్నో కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. గతంలో టిడిపి హయాంలో పెంచిన జీఎస్టీని 18 శాతం నుంచి తాను ఐదు శాతంకు తీసుకువచ్చానని తెలిపారు. వాలంటీర్లు, కన్వీనర్లు సమన్వయంతో పని చేసి సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందేలా చేయాలని సూచించారు. నియోజకవర్గ పరిశీలకులు అబ్దుల్ ఖాన్ మాట్లాడుతూ పాల్గొని వచ్చే ఎన్నికల్లోగా పార్టీ కార్యకర్తలు, నాయకులు, కన్వీనర్లు చేపట్టాల్సిన విధి విధానాలను వివరించారు. జిల్లా పరిశీలకులు మాజీ మంత్రి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నంగా ఉన్నప్పటికీ ధనాన్ని పోగుచేసి సంక్షేమ పథకాలకు అందిస్తున్నారని, ఆ విషయాన్ని ప్రతి గడపకు చెప్పాల్సిన బాధ్యత కన్వీనర్లకు, పార్టీ నాయకులకు ఉంటుందని తెలిపారు. అందరూ ఐక్యతతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు పేరం సత్య నారాయణరెడ్డి, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి, అంకిరెడ్డిపల్లె లక్ష్మీకాంతరెడ్డి, రాంమెహన్ రెడ్డి, సత్తిగాడు రామిరెడ్డి, మొలక రాజారెడ్డి, యాపర్ల వెంకటేశ్వర రెడ్డి, కంబగిరి స్వామి, గోరిమాన్ పల్లె జగన్, సర్పంచ్ రామాంజనేయులు, తుమ్మలపెంట మల్లేశ్వర్ రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, వైఎస్ఆర్సీపీ నాయకులు పాల్గొన్నారు.

మాట్లడుతున్న బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

వంగవీటి, కైకాలలకు నివాళి

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్ : కర్నూలు సిటి జిల్లా బలిజ సంఘం జనసేన టిడిపి, బిజెపి నాయకుల ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా 34 వవర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. వంగవీటిరంగా కేవలం కాపు నాయకుడు మాత్రమేకాదని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని తెలిపారు. ఆయన జనం మనిషని నిరంతరం జనంలో కలిసి తిరిగారన్నారు. ఆయన ఈ వర్తమాన రాజకీయాల్లో లేకపోవడం బలిజ తెలగ, కాపు వర్గాలకు తీరని నష్టమన్నారు. ఇటీవల దివంగతులైన సినీ నటులు కైకాల సత్యనారాయణతో పాటు సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన మిరియాల వెంకట్రావు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. సభలో జనసేన జిల్లా అధ్యక్షులు సురేష్, జిల్లా బలిజ సంఘం అధ్యక్షులు కోనేటి చంద్రబాబు, మాజీ అధ్యక్షులు భాస్కరబాబు, సిటి అధ్యక్షులు శ్రీనివాసులు, బిజెపి నాయకులు కొట్టె చెన్నయ్య, బత్తలపల్లిరామకృష్ణ, లలితకళాసమితి అధ్యక్షులు పత్తి ఓబులయ్య, నారాయణ రెడ్డి, బాబు, పరమేశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

మా పెన్షన్లు మాకు ఇప్పించండి

ప్రజాశక్తి- గూడూర్

మా పెన్షన్లు మాకు ఇప్పించాలంటూ గూడూరు గ్రామంలో చాలామందికి 1000 చదరపు అడుగులు ఉంటే మీ పెన్షన్లు తొలగిస్తామని ప్రభుత్వం నుండి ఆదేశాలు వచ్చాయని సచివాలయం సిబ్బంది వాలంటీర్లు ఇంటింటికి తిరిగి వెయ్యి చదరపు అడుగులు ఉన్నవారికి పెన్షన్ తొలగించామని తెలిపారు. గూడూరు గ్రామంలో దాదాపు 200 మందికి పైగా పెన్షన్లు తొలగించడంతో వికలాంగులు, వృద్ధాప్య పెన్షన్లు భర్త చనిపోయిన పెన్షన్లను చాలామందివి పోతాయని పెన్షన్ దారులు భయాందోళనకు చెందుతున్నారు. సోమవారం టిడిపి కర్నూలు పార్లమెంట్ కార్యదర్శి చరణ్ కుమార్ , గూడూరు పట్టణ తెలుగు యువత ఉపాధ్యక్షులు వై.నాగరాజు ఆధ్వర్యంలో స్థానిక నగర పంచాయతీ చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లకు వినత పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్, టిడిపిలు ప్రభుత్వాలు అందరికీ పెన్షన్ ఇస్తూ ఇప్పుడు వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత పెన్షన్లు తొలగిస్తామని చెప్పి నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. పెన్షన్ దారులు చాలా ఇబ్బందులు పడతారని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీవోను రద్దు చేయాలని పెన్షన్ దారులకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ గూడూరు నగర పంచాయతీ ఉన్నటువంటి అరులైన పెన్షన్లకు తొలగించకుండా తగు చర్యలు తీసుకొని ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి తగు న్యాయం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బివి.కిషోర్ వర్మ, రేవుల రామకృష్ణ తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గూడూరు మున్సిపల్ ఛైర్మన్‌కు వినతి ఇస్తున్న బాధితులు

రాష్ట్ర స్థాయికి ఎంపికయిన క్రీడాకారులతో సిఇఒ రమణ, తదితరులు

యోగా పోటీల్లో విజేతలుగా తిరిగిరండి

ప్రజాశక్తి-కర్నూల్ స్పోర్ట్స్

ఈనెల 27న తిరుపతిలో జరిగిన రెండవ రాష్ట్రస్థాయి యోగా శాప్‌లీగ్ పోటీలలో కర్నూలు జిల్లా క్రీడాకారులు పాల్గొని పతకాలే లక్ష్యంగా ముందుకు సాగాలని జిల్లా క్రీడా శాఖ సిఇఒ పివి.రమణ ఆకాంక్షించారు. సోమవారం నగరంలోని ఔట్ డోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం సీనియర్ న్యాయవాది శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి యోగపోటీల్లో క్రమశిక్షణతో పాల్గొని విజేతలుగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్‌శెట్టి, కబడ్డీ శిక్షకులు భూపతిరావు, యోగసంఘం సభ్యులు మునిస్వామి, శశిధర్, గంగాధర్, వ్యాయామ ఉపాధ్యాయులు కళ్యాణి, సుప్రియ, తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ లేవల్ స్కూల్ కబడ్డీ పోటీలలో డి హుసేనాపురం విజేత

ప్రజాశక్తి- వెల్దుర్తి : భారత క్రీడా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ ను వెల్దుర్తి మండలం గోవర్ధనగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిచారు. బ్లాక్ స్కూల్ లేవల్ కబడ్డీ పోటీల నందు డి.హుసేనాపురం జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రథమ స్థానం కైవసం చేసుకోగా గోవర్ధనగిరి జిల్లా పరిషత్ పాఠశాల రెండవ స్థానంలో రాణించారు. నెహ్రూ యువ కేంద్రం సహకారంతో కొండ హెల్పింగ్ హాండ్స్ అండ్ యూత్ సొసైటీ , జయరాం యువ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి , జిల్లా యువజన వ్యవహారాల అధికారి రాహుల్ రెడ్డి, కొండ హెల్పింగ్ హాండ్స్ అండ్ యూత్ సొసైటీ ఫౌండర్ కొన్నాళ్ల లోకేష్ రావు ,వైసిపి నాయకులు తడకల జయరాం హాజరయ్యారు. ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోనూ మంచిగా రాణించాలి తెలిపారు. రాహుల్‌రెడ్డి మాట్లాడుతూ ఆటల్లోనూ వ్యాయామ విద్యలోనూ ప్రోత్సాహ ంగా ఉండాలన్నారు. కొండ లోకేష్ రావు మాట్లాడారు. విజేతలకు ఎమ్మెల్యే బహుమతులను అందజేశారు. గోవర్ధనగిరి జిల్లా పరిషత్ పాఠశాల నందు ఏర్పాటు చేసినందుకు గాను జయరాం యువసేవా సమితి ప్రెసిడెంట్ తడకల రామాంజనేయులు, నెహ్రూ యువ కేంద్రంవారికి , కొండ హెల్పింగ్ హాండ్స్ అండ్ యూత్ సొసైటీ వారికి కతజ్ఞతలు తెలిపారు. పాఠశాల ఇంచార్జ్ హెడ్మాస్టర్ అప్పారావు, సర్పంచ్ చిన్నయల రాముడు , వ్యాయామ విద్య ఉపాధ్యాయులు రామకష్ణుడు , సొసైటీ మీడియా కోఆర్డినేటర్ కూరపాటి చంద్రకళ, సొసైటీ మెంబర్ కొండ రామాంజ నేయులు,ఃపాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఎస్ఇ

కర్నూలు కార్పొరేషన్: జిల్లా విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి డయల్ యువర్ ఎస్ఇ కార్యక్రమాన్ని ఈనెల 27న మంగళవారం ఉదయం 10:00గంటల నుండి 11:00గంటల వరకు నిర్వహిస్తామని కర్నూలు ఎపి ఎస్‌పిడిసిఎల్ పర్యవేక్షక ఇంజనీరు ఎం. ఉమాపతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను గురించి 7382 614308 సెల్ నెంబర్‌కు ఫోన్ చేసి సమస్యల పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కావున విద్యుత్ వినియోగదారులు ఈ సదవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

సరుకుల రవాణాలో ఎపిఎస్ఆర్‌టిసి అగ్రగామి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో లాజిస్టిక్ వ్యాపారం 2017 లో మొదలు పెట్టిన నాటి నుండి దిన దినాభివృద్ధి చెందుతూ, సరుకు రవాణాలో అగ్రగామిగా నిలిచిందని జిల్లా రవాణా అధికారి టేకి వెంకటరామమ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంస్థలో సరుకు రవాణా 2017 ఆగస్టు 27న ప్రారంభించామన్నారు. 2021 సెప్టెంబర్ నుండి పార్సెల్స్ డోర్ డెలివరీ సౌకర్యం కల్పించామన్నారు. పార్సెల్స్ , కొరియర్స్ రవాణాతో పాటు, సర్వీస్ బస్సులలో ఉన్న డిక్కీ స్పేస్, డిజిటి ల ద్వారా కూడా సరుకు రవాణా చేస్తున్నామన్నారు. 2018 ఆగస్టులో లీటరు కు రూ.70గా ఉన్న డీజిల్ రేటు, డిసెంబరు, 2022 నాటికి లీటరుకు రూ.100గా పెరిగినప్పటికీ, డీజిల్ భారాన్ని, ప్రజలపై మోపకుండా 2018లో ఉన్న సరుకు రవాణా రేట్లనే, నేటికి కొనసాగిస్తున్నామన్నారు. ఇతర ప్రైవేటు సరుకు రవాణా ఏజెన్సీలతో పోలిస్తే, అత్యంత చవకైన, వేగవంతమైన సంస్థ సరుకు రవాణాను ప్రజలు ఆదరించడంతో కర్నూలు జిల్లా సరుకు రవాణా ఆదాయం ఈ సంవత్సరం (25.12.2022) నాటికే రూ.4.09 కోట్ల 2011-22 ఆదాయాన్ని ఆర్జించి, గత సంవత్సరం ఆదాయాన్ని (రూ.3.99 కోట్లు) అధిగమించిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనతలో భాగస్వాములైన అధికారులకు, సూపర్వైజర్లకు, సిబ్బందికి, ముఖ్యంగా ప్రజలతో నేరుగా సంబంధా లుండే డ్రైవర్లు, కండక్టర్లు, కార్గో కాంట్రాక్ట్ సిబ్బందికి సంస్థమేనేజింగ్ డైరెక్టరు అభినందనలు తెలిపారు.

సంక్రాంతికి ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు

కర్నూలు కార్పొరేషన్ : సంక్రాంతి పండగను పురస్కరించుకొని ప్రయాణికుల సౌకర్యార్థం ఎపిఎస్‌టిసి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ప్రజా రవాణా అధికారి టేకి వెంకటరామం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని స్వంత ఊళ్లకు వెళ్ళేగోరు ప్రయాణీకుల సౌకర్యార్థం హైదరాబాదు, బెంగుళూరు, తిరుపతి , విజయవాడ నగరాల నుండి కర్నూలుకు 2023 జనవరి ఒకటి నుంచి 14 వరకు, అలాగే తిరుగు ప్రయాణమై వెళ్ళు ప్రయాణీకుల సౌకర్యార్థం కర్నూలు నుండి హైదరాబాదు, బెంగుళూరు, తిరుపతి , విజయవాడ నగరాలకు జనవరి 15నుంచి 19 వరకు షెడ్యూలు బస్సులకు అదనంగా ప్రత్యేక బస్సులు నడుపుతామని తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులలో కూడా సాధారణ చార్జి మాత్రమే వసూలు చేస్తామని తెలిపారు. ఈ సర్వీసులకు రాను, పోను రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉందన్నారు. రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచుతామన్నారు. ప్రజలు అసౌకర్యవంతమైన, భద్రతలేని ప్రైవేటు వాహనాలలో ప్రయాణించకుండా, సౌకర్యవంతమైన, సురక్షితమైన ఆర్‌టిసి బస్సులలో ప్రయాణించాలన్నారు. ఆర్‌టిసి కల్పిస్తున్న ఈసౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పొగాకు రైతు కుదేలు

- వర్షాలకు దెబ్బతిన్న పంటను పీకేస్తున్న వైనం
- నేడు పొగాకు బోర్డు వద్ద ఆందోళన

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో

టంగుటూరు మండలం సూరారెడ్డిపాలేనికి చెందిన ఓ రైతు 20 ఎకరాలలో పొగాకు వేశారు. మాండూస్ తుపాను వల్ల కురిసిన వర్షాలకు పంట అంతా పోయింది. తోటలను పీకేశారు. మళ్లీ నాట్లు వేసేందుకు సన్నాహాల్లో ఉన్నారు. రూ.10 లక్షలకుపైగానే నష్టం వాటిల్లింది. అదే ఆలోచనతో ఇంటిలో కూర్చొన్న ఆయన గుండెపోటుతో ఆస్పత్రిలో చేరాడు.

ప్రస్తుతం పొగాకు రైతుల పరిస్థితి ఇదీ. ఇటీవల కురిసిన వర్షాలకు పొగాకు పంటకు భారీగా నష్టం వాటిల్లింది. నష్టం ఎంతనేదీ అంచనాలు వేయడంలో పొగాకు బోర్డు పూర్తి నిర్లక్ష్యంగా ఉంది. వ్యవసాయ శాఖ తమ పరిధిలోని పంటలను మాత్రమే ఎన్యూమరేషన్ చేసింది. 69 వేల ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నట్లు ప్రభుత్వానికి నివేదిక పంపింది. పొగాకు విషయానికి వచ్చే సరికి పూర్తిగా వదిలేశారు. కేంద్రం స్పందించే పరిస్థితి లేదు. పార్లమెంటులో పొగాకు రైతుల విషయం ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి ప్రస్తావించారు. అక్కడ నుంచి ఎలాంటి స్పందనా లేదు.

తోటలను పీకేసిన రైతులు

వర్షాలకు తోటలు భారీగా దెబ్బతిన్నాయి. ఎండిపోయి ఆకులు పండాయి. వడలిపోవడంతో చేసేదేమీలేక నాలుగు రోజులుగా తోటలను పీకి గట్లపై కుప్పేస్తున్నారు. మళ్లీ పొగాకు నాట్లు వేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. టంగుటూరు, కొండపి, జరుగుమల్లి, ఒంగోలు, నాగులుప్పలపాడు, మద్దిపాడు, సంతనూతలపాడు మండలాల్లో సుమారు పది వేల ఎకరాల్లో తోటలను ఇప్పటికే పీకేశారు. ఎకరాకు కనీసం రూ.40 వేలు పెట్టుబడి పెట్టారు. నెల రోజులు తోటలు పెరిగాయి. కొన్ని చోట్ల దిగుబడి కూడా వచ్చింది. క్యూరింగ్ ముమ్మరంగా సాగాల్సిన సమయంలో వర్షాలు నిలువునా ముంచాయి. ఎక్కువ నష్టం నల్లరేగడి నేలల్లోనే జరిగింది. ఎందుకంటే కురిసిన వర్షం భూమిలోకి ఇంకిపోవడం తక్కువ. దీంతో, వర్షాలకు కురిసిన నీరంతా తోటల్లోనే ఉంది. నాలుగు రోజులపాటు తోటలు నీటిలోనే మునిగాయి. వర్షపు నీరు బయటకుపోవడానికి కూడా వీల్లేకుండా కొన్ని గ్రామాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో పొగాకు తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. టంగుటూరు మం డలంలో దాదాపు అన్ని గ్రామాల్లోనూ తోటలను పీకేశారు.

ఎకరాకు రూ.40 వేలకుపైగా నష్టం

జిల్లాలో 1.25 లక్షల ఎకరాల్లో పొగాకు సాగైంది. 40 వేల ఎకరాల్లో పొగాకు తోటలకు నష్టం వాటిల్లింది. పూర్తిగా దెబ్బతిని ఎందుకూ పనికిరాకుండా పది వేల ఎకరాలు ఉంది. దీన్నంతా ఇప్పుడు పీకేశారు. దీనికి ఎకరాకు కనీసం రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకూ నష్టం తప్పలేదు. మిగతా ప్రాంతాల్లో తోటలు తిప్పుకున్నాయి. ఆకులు రంగు మారాయి. ఎకరాకు కనీసం రెండు క్వింటాళ్లు దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. నాణ్యత కూడా తగ్గుతుంది. రంగుమారి లోగ్రేడు ఎక్కువగా వచ్చే ప్రమాదం లేకపోలేదు. రాష్ట్రంలో ఈ ఏడాది 142 మిలియన్ కిలోల పొగాకును పండించేందుకు అనుమతి ఇచ్చారు. దీంట్లో సగం కూడా పండుతుందా? అనేదీ అనుమానమే. మరోవైపు కర్ణాటకలో మార్కెట్ బాగా ఉంది. అక్కడ కూడా దిగుబడి తగ్గినందున ధరపై రైతులు ఆశగా ఉన్నారు. కానీ, పంట తగ్గిపోవడంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి.

కనీస స్పందన లేని పొగాకు బోర్డు

పొగాకు బోర్డును కేంద్రం అజమాయిషీ చేస్తోంది. కానీ, ఏమి జరిగినా బోర్డు స్పందన పెద్దగా ఉండడం లేదు.. ఎంపిలు కేంద్రం దృష్టికి తీసుకుపోయినా పెద్దగా స్పందన కనిపించడం లేదు. పంట పీకేస్తున్నా పట్టడం లేదు. కనీసం ఎంత నష్టం జరిగిందనే అంచనాలు కూడా లేవు. వ్యాపారులకు అనుకూలమైన నిర్ణయాల్లో మాత్రం పొగాకు బోర్డు వేగంగానే స్పందిస్తోంది. వ్యాపారులు సిండికేట్‌గా మారి సీలింగు ధర ఇస్తున్నా పట్టించుకోలేదు.

నేడు బోర్డు కార్యాలయం వద్ద రైతుల ధర్నా

పొగాకు రైతులను ఆదుకోవాలని, నష్టపరిహారాలు ఇవ్వాలని, రుణాలు రీషెడ్యూల్ చేయాలని, బ్యారన్‌కు లక్ష రూపాయలు ఇవ్వాలన్న డిమాండ్లతో మంగళవారం ఒంగోలులోని పొగాకు బోర్డు కార్యాలయం వద్ద ధర్నాకు రైతు సంఘం, కౌలు రైతు సంఘం పిలుపునిచ్చాయి. బాధిత రైతులు తరలిరావాలని ఆయా సంఘాల నేతలు కోరారు.

నాగులుప్పలపాడు మండలం, ఉప్పుగుండూరులో పీకేస్తున్న పొగ తోటలు, ఇన్‌సెట్‌లో తొలగించిన పొగాకు కుప్ప

రూ.9.2 కోట్ల గంజాయి దగ్ధం

ప్రజాశక్తి- మధురవాడ, విశాఖ

విశాఖలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పట్టుబడిన రూ.9.2 కోట్ల విలువైన గంజాయిని పోలీసులు సోమవారం దగ్ధం చేశారు. దీనిపై విశాఖ పోలీస్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. 518 కేసుల్లో పట్టుబడిన 21,961 కిలోల గంజాయి, 23 కిలోల అసిస్ ఆయిల్, 960 గ్రాముల చాకెట్లను కోర్టు అనుమతితో కాపులుప్పాడ డంపింగ్‌యార్డులో దహనం చేశామని చెప్పారు. గతంలో పాడేరు ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి వచ్చేదని, ప్రస్తుతం ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్ తదితర ప్రాంతాల నుంచి విశాఖకు గంజాయిని తరలిస్తున్నారని తెలిపారు. ఇక్కడి నుంచి ఢిల్లీ, కేరళ, ఉత్తరప్రదేశ్ తదితర ప్రాంతాలకు చేరవేస్తున్నారని చెప్పారు. ఎక్కడైనా గంజాయి అక్రమ రవాణా జరిగితే 14500 నంబర్‌కు సమాచారం అందిస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని శ్రీకాం త్‌రెడ్డి తెలిపారు. డబ్బుకు ఆశపడి గంజాయి అక్రమ రవాణాకు దిగవద్దని కోరారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ధర్నా

ప్రజాశక్తి - గణపవరం (ఏలూరు జిల్లా)

ధాన్యం కొనుగోలులో ఆలసత్వంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా గణపవరం మండలం పిప్పరలో సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. పిప్పరకు చెందిన వట్టిపోలు కొండబాబు, వీరవల్లి దానయ్య సాగుచేసిన 11 ఎకరాల్లోని ధాన్యం 20 రోజులుగా కళ్లాలోనే ఉండిపోయిందని, గోనె సంచులు ఇవ్వాలని అధికారుల చుట్టూ తిరుగున్నా ఇవ్వకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇదే సమస్య మండలం వ్యాప్తంగా ఉందన్నారు. మరోవైపు నాట్లు వేసేందుకు సమయం మించిపోతుండటంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని తెలిపారు. ఆరుదలకు వచ్చిన ధాన్యం కూడా అధికారులు కొనుగోలు చేయకపోవడం దారుణమన్నారు. తరుగు పేరుతో మద్దతు ధరలో కోత పెట్టడం తగదన్నారు. రైతులకు సరిపడ సంచులు ఇవ్వాలని, ధాన్యం రవాణాకు లారీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గుత్తుల శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

ధర్నాలో మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప

దళిత కుటుంబంపై దాడి హేయం

- నిందితులను తక్షణం అరెస్టు చేయాలని ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం మండల పరిధిలోని సోమలదొడ్డి పంచాయతీ, నవయుగ కాలనీలో నివాసముంటున్న దళిత కుటుంబంపై దాడి చేయడం అత్యంత హేయమని దళిత, గిరిజన సంఘాల నాయకులు పేర్కొన్నారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ అనంతపురం డిఎస్‌పి కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఒ నల్లప్ప మాట్లాడుతూ దళితుడు వన్నూరు స్వామి ఆయన భార్య, పిల్లలపై రాజు 30 మంది అనుచరులతో కలిసి కర్రలు, రాళ్లతో విచక్షణా రహితంగా దాడి చేశారన్నారు. మహిళ అని చూడకుండా చీర విప్పి, జుట్టు పట్టుకుని దాడి చేయడం సభ్యసమాజం అసహ్యించుకునే చర్యని అని పేర్కొన్నారు. తనపై దాడి జరిగిందని వన్నూరుస్వామి గత నెల 25న నాల్గవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారని, దీనిపై పోలీసులు ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడంతో మళ్లీ ఆదివారం నాడు మరోసారి ఆయన కుటుంబంపై దాడి, హత్యాయత్నం జరిగిందని తెలిపారు. ఎస్ఐ గంగాధర్ దాడి చేసిన గూండాలకు మద్దతుగా నిలిచి బాధితులపైనే తప్పుడు కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులకు అన్యాయం చేసేలా వ్యవహరిస్తోన్న ఎస్ఐని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. శింగనమల మండలం జూలాకాలువ గ్రామంలో భూ సమస్యపై అకారణంగా దాడికి పాల్పడిన వారిపైనా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత, గిరిజన ప్రజా సంఘాల నాయకులు కెపి నారాయణస్వామి, ఎల్లన్న తదితరులు పాల్గొన్నారు.

రబీకి వారబందీ ప్రకారం సాగు నీరు

- కెసి కెనాల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ తిరుమలేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

కెసి కెనాల్ ఆయకట్టు కింద రబీ సాగుకు వార బందీ కింద పంట పొలాలకు సాగునీరు ఇవ్వనున్నట్లు కెసి కెనాల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ తిరుమలేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రబీలో ఆరుతడి పంటలు వేసుకోమని సూచించామని, అయితే రైతులు అధికంగా వరి వేసుకున్నారని చెప్పారు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు వార బందీ కింద పంటలు ఎండిపోకుండా చివరి ఆయకట్టు వరకు రైతులకు నీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. టిబి డ్యాంలో, సుంకేసుల బ్యారేజ్‌లో ఉన్న నీటి లభ్యత, వేసవిలో తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని రెండు టిఎంసిలు తాగు నీటికి ఉపయోగించుకుంటూ మిగిలిన నీటిని పంటలకు ఉపయోగిస్తామన్నారు.

మాట్లాడుతున్న తిరుమలేశ్వర్ రెడ్డి

నంద్యాల జిల్లాకు సంబంధించి శ్రీశైలం రిజర్వాయర్ నీటి లభ్యత, పోతిరెడ్డిపాడు బ్యాక్ వాటర్‌ను బట్టి మల్యాల ఎత్తిపోతల పథకం, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని కెసి కెనాల్‌లోకి మళ్లిస్తామన్నారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

అందుబాటులో 35,498 మెట్రిక్ టన్నుల ఎరువులు

- ఎంఆర్‌పి కంటే అధికంగా అమ్మితే కఠిన చర్యలు
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి టి.మోహన్ రావు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో రబీ సాగుకు సంబంధించి 35498 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పి.మోహన్ రావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 8,500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా 10 వేల మెట్రిక్ టన్నులు నిల్వ ఉందన్నారు. డిఎపి 3,500 అవసరం కాగా 56 మెట్రిక్ టన్నులు, పొటాషియం 1,562 అవసరం కాగా 1,432 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 17,850 మెట్రిక్ టన్నులకు గాను 16,800, ఎస్ఎస్పి 820కు గాను 2,200 మెట్రిక్ టన్నులు ఉన్నట్లు పేర్కొన్నారు. యూరియా రూ.266.67, డిఏపి రూ.1350, 20-20-13 రకం రూ.1350, 10-26-26 రకం రూ.1,470, 12-32-16 రకం రూ.1470 ధరలు ఉన్నాయని చెప్పారు. రైతులు ఎరువుల దుకాణాల వద్ద కొన్న వెంటనే రసీదు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్‌పి కంటే ఎక్కువ ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధిక ధరలకు అమ్ముతున్నట్లు రైతులు భావిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 155251 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఉన్న వృత్తి విద్య కేంద్ర భవనంలో ఎపి సమగ్ర శిక్ష నంద్యాల జిల్లా కార్యాలయాన్ని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.అనురాధ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఎం.మహబూబ్ బేగ్, సమగ్ర శిక్ష ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్ జి.ఓబయ్య, సమగ్ర శిక్ష పర్యవేక్షకులు, సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

కార్యాలయం ప్రారంభోత్సవంలో డిఇఒ తదితరులు

జిల్లాలో సిఐటియు ఉద్యమ ప్రస్థానం

- నేటి నుంచి జిల్లా ద్వితీయ మహాసభలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సిఐటియు నంద్యాల జిల్లా ద్వితీయ మహాసభలు ఈనెల 27 నుంచి 28 వరకు రెండు రోజులపాటు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో నంద్యాల జిల్లాలో సిఐటియు ఉద్యమ ప్రస్థానం. నంద్యాల జిల్లాలో సిఐటియు కార్మిక వర్గాన నిలబడుతూ.. అనేక రంగాల్లో కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తూ కనీస వేతనాలు సాధించుకోవడంతోపాటు కార్మికుల హక్కులపై నినదించి నంద్యాల , నందికొట్కూరు, ఆత్మకూరు, బనగానపల్లె డోన్, ఆళ్లగడ్డ బేతంచర్ల తదితర ప్రాంతాల్లో సిఐటియు విస్తరించినది. నంద్యాలలో అత్యవసర పరిస్థితి 1975 సంవత్సరంలో నంద్యాల రైల్వే గూడ్స్ యూనియన్ ఏర్పాటుకు నాంది పలికింది. అప్పటి నుండి అనేక రంగాల్లో యూనియన్ నిర్మాణమైంది. నంద్యాల రైల్వే గూడ్స్ , టెక్నికల్ యూనియన్లను శంకరయ్య, మద్దులు ప్రారంభించారు.1979 లో టెక్నికల్ కేబుల్స్ ఫ్యాక్టరీ యూనియన్ , నంద్యాల మోటార్ వర్కర్స్ యూనియన్ ఏర్పడింది. అప్పట్లో మస్తాన్ వలి విద్యార్థి దశ నుండి యువజన ఉద్యమంలో ఉంటూ రైల్వే గూడ్స్ షెడ్యూల్ బాధ్యతలు చూస్తూ సెంట్రల్ వెర్ హౌస్ హమాలీ యూనియన్ సిడబ్ల్యుసి హమాలి యూనియన్‌ను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కాటన్ బిల్లులు ఆయిల్ మిల్లు రైస్ మిల్లులలో హమాలీ కార్మికులు, ఫ్యాక్టరీలలో ఆయిల్ ఎస్ ఏ కూలీలు ప్రెస్సింగ్ వర్కర్లు అలాగే టెక్నికల్ వర్కర్స్‌తో యూనియన్ ఏర్పడింది. ఆ రోజుల్లోనే పాల కేంద్రంలో రామరాజు ద్వారా యూనియన్ ఇండిపెండెంటు ఏర్పాటు చేసిన ఆ తర్వాత సిఐటియూలోకి వచ్చారు. గౌండా కార్మికుల యూనియన్, ఫ్రూట్ హమాలీ వర్కర్స్,చక్కెర ఫ్యాక్టరీ వర్కర్స్, మార్కెట్ యార్డు హమాలీ వర్కర్స్ యూనియన్, సివిల్ సప్లై గోడౌన్ హమాలి యూనియన్లు నంద్యాలలో ఏర్పాటు చేశారు. వీటి ప్రభావం ఆర్టీసీ లో పని చేస్తున్న హమాలీల పైన పడి ఆర్టీసీ హమాలి యూనియన్ ఏర్పాటుకు ముందుకొచ్చారు. కరెంట్ ఆఫీస్‌లో పొల్లు ట్రాన్స్‌ఫార్మర్లు లోడింగ్ అన్‌లోడింగ్ చేసే హమాలీ యూనియన్ ఏర్పడింది. అప్పటిముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు ప్రారంభించిన సమయంలో ఇస్తున్న అతి తక్కువ వేతనాలకు వ్యతిరేకంగా అక్కడి కార్మికులను సంఘటిత పరచి నంద్యాల కోఆపరేటివ్ స్పిన్నింగ్ మిల్ యూనియన్ ఏర్పాటు చేశారు. అక్కడ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులకు యాజమాన్యంకు మధ్యవర్తిగా అనేక అగ్రిమెంట్లు చేసి వేతనాలు పెంచి స్పినింగ్ మిల్ కార్మికులకు అండగా నిలబడింది. వీటన్నిటితోపాటు నంద్యాలలో అతిపెద్ద యూనియన్‌గా సిఐటియు నాయకత్వంలో తోట ముద్దులు, విష్ణుమూర్తి నంద్యాల లారీ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ యూనియన్ ఏర్పాటు చేశారు. అనేక అగ్రిమెంట్లు చేసి వేతనాలు పెంచడం వల్ల వాటి ప్రభావం సిటీ బస్సు కార్మికుల పైబడి సిటీ బస్సు కార్మికుల యూనియన్ ఏర్పడటానికి లారీ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ యూనియన్ దోహదం చేసింది. నాయకత్వం అన్ని యూనియన్లలో ఏ సమస్య వచ్చినా స్పందిస్తూ సిఐటియు విస్తరణకు కృషి చేస్తోంది. సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలకు మద్దతుగా కర్నూలు పేపర్ మిల్లు కార్మికుల పోరాటాలకు మద్దతుగా నంద్యాల ప్రాంత కార్మిక వర్గం నిలవడం వలన మహానంది ప్రాంతంలో ఏర్పడిన భారత్ కోకకోల కంపెనీలో యూనియన్ ఏర్పడింది. దీంతో పాటు అనేక రంగాలలో యూనియన్లను ఏర్పాటు చేశారు. కార్మికుల వేతనాలపెంపునకు, హక్కుల సాధనకు సిఐటియు కృషి చేసింది.

అరుణ పతాకాలతో సిద్ధమైన నంద్యాల

రాష్ట్ర విభజన తర్వాత గ్రామాల్లో శానిటేషన్ కార్మికులకు అతి తక్కువ వేతనాలతో ఉద్యోగంలోకి తీసుకొని చివరి సమయంలో ఇవ్వకపోవడం వలన వారి వేతనాల సాధన కోసం సిఐటియు అనుబంధంలోకి వచ్చారు. వారి వేతనాల పెంపునకు పోరాటం చేశారు. గ్రామ వార్డు సచివాలయంలో పనిచేస్తున్న ఆశ వర్కర్స్, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విఎఒల సంఘం ఏర్పాటు చేసి వారి హక్కుల కోసం పోరాడుతుంది. హస్పిటళ్లలో అంబులెన్స్ డ్రైవర్స్ కాంపౌండర్స్ నర్సుల వేతనాల పెంపుదల కోసం, గురుకుల విద్యాసంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సిబ్బంది వేతనాల పెంపుదల, కోసం రెగ్యులర్ కోసం పోరాడుతుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తూ దుర్మార్గమైన చట్టాలు తీసుకుని రావడం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా చట్టాలను మార్చాయి. వాటికి వ్యతిరేకంగా పోరాడుతుంది. ఇవే కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, బ్యాంకు, ఎల్ఐసి పోస్టల్, టెలికం ఉద్యోగుల హక్కుల కోసం, ఉపాధ్యాయుల హక్కుల కోసం, అసంఘటిత కార్మికులకు మద్దతుగా నిలబడి పోరాడుతుంది. నంద్యాల నంది గ్రూప్ సంస్థలో ఉన్న లిక్కర్ ఫ్యాక్టరీలో కూడా లోడింగ్ అన్‌లోడింగ్ కార్మికుల వేతనాల పెంపుకోసం పోరాడుతుంది. ఆనాటి స్ఫూర్తి నేటి కొత్తతరం నాయకులకు బిటి రణదీవే, నండూరి ప్రసాద్‌రావు, జ్యోతిబాసు, ఇఎంఎస్ నంబూద్రిపాద్, హరికిసన్ సింగ్ సూర్జిత్‌ల స్ఫూర్తి పొంది అప్పటి నాయకత్వం పనిచేసింది. చేస్తూ ఉంది. అదే స్ఫూర్తితో ... ప్రస్తుత నాయకత్వం రాబోయే తరం కార్మిక వర్గ నాయకత్వం విప్లవమే ఊపిరిగా సమాజ మార్పు కోసం సోషలిస్టు సమాజ నిర్మాణం కోసం నూతన నాయకత్వం పనిచేయాలని కోరుకుందాం.

నేటి నుండి ప్రారంభం కానున్న సిఐటియు ద్వితీయ జిల్లా మహాసభలు

మహాసభలకు ముస్తాబైన నంద్యాల పట్టణం

సిఐటియు నంద్యాల జిల్లా ద్వితీయ మహాసభలు ఈనెల 27నుంచి ప్రారంభం కానున్నాయి. రెండు రోజులపాటు జరిగే మహాసభలకు నంద్యాల పట్టణం ముస్తాబైంది. పలు వీధులను, ప్రధాన కూడళ్లను ఎర్ర తోరణాలతో నింపేశారు. ఎన్‌జిఒ కాలనీ నేషనల్ పిజి కాలేజీలోని టి.షడ్రక్ ప్రాంగణంలో నిర్వహించే మహాసభ నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు తెలిపారు. వారి వివరాల ప్రకారం.... జిల్లా వ్యాప్తంగా సిఐటియు ఉద్యమంలో క్రియాశీలకంగా ఉండే 300 మంది ప్రతినిధులుగా రానున్నారు. మహాసభలో గత కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్ కార్యక్రమాలను రూపొందించుకోనున్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము - శ్రీశైలంలో పర్యటన
- ప్రసాద్ స్కీం కింద రూ. 43.08 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం
- శివాజీ స్ఫూర్తి కేంద్రంలో గిరిజన మహిళలతో ముఖాముఖి

ప్రజాశక్తి - శ్రీశైలం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను చెంచు గిరిజనులు సద్వినియోగం చేసుకొని జీవన విధానాలను మెరుగుపరుచుకోవాలని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం శ్రీశైలంలో పర్యటించారు. శ్రీశైల పుణ్యక్షేత్రంలో ప్రసాద్ స్కీం కింద రూ.43.08 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ప్రారంభించారు. అంతకుముందు ఉదయం 11.45 గంటలకు సున్నిపెంట హెలిప్యాడ్‌కు భారత రాష్ట్రపతి చేరుకున్నారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, రాష్ట్ర మంత్రులు కొట్టు సత్య నారాయణ, బుగ్గన రాజేంద్రనాథ్, కిషన్‌రెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందారెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్, ఏడిజిపి ఎల్ఎల్ఓ రవిశంకర్, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్, జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం భ్రమరాంబ అతిథిగృహం చేరుకున్నారు. అక్కడి నుంచి శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల దర్శనార్థం ఆలయం వద్దకు మధ్యాహ్నం 12-45 గంటలకు చేరుకున్నారు. అక్కడ మంత్రులు కొట్టు సత్యనారాయణ, ఆర్‌కె.రోజా, దేవదాయశాఖ కమిషనర్ డాక్టర్ హరిజవహర్‌లాల్, ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డి వారి చక్రపాణి రెడ్డి, దేవస్థానం ఈఓ లవన్న, అర్చక స్వాములు, వేద పండితులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రాష్ట్రపతి ముందుగా రత్నగర్భ గణపతి స్వామి వారిని దర్శించుకుని హారతిని స్వీకరించారు. అనంతరం మల్లికార్జునస్వామి, భ్రమరాందేవి అమ్మ వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లికా గుండంలో ప్రతిబింబించే ఆలయ విమాన గోపురాన్ని దర్శించుకున్నారు. భారత రాష్ట్రపతి, తెలంగాణ గవర్నర్లను అర్చక స్వాములు, వేద పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలను అందజేశారు. తరువాత శేషవస్త్రాలను, లడ్డు ప్రసాదాలను, జ్ఞాపికను అందజేశారు.

టూరిజం ఫెసిలిటేషన్ సెంటర్ (యాత్రికుల సదుపాయ కేంద్రం) శిలాఫలకం ఆవిష్కరణ

నంది సర్కిల్ సమీపంలోని టూరిజం ఫెసిలిటేషన్ సెంటర్‌లో (యాత్రికుల సదుపాయ కేంద్రం) రూ. 43.08 కోట్లతో చేపట్టిన ప్రసాద్ ప్రాజెక్ట్‌ను రిబ్బన్ కట్ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. హఠకేశ్వరం, శిఖరేశ్వరంలలో ఎమినిటీస్ సెంటర్, శిఖరేశ్వరంలో పుష్కరిణి పునరుద్ధరణ, ఆలయంలో కళాత్మక విద్యుద్దీకరణ, బస్టాండ్ నుంచి పాతాళగంగ వరకు కృష్ణవేణి రోడ్డు నిర్మాణం, యాంఫీథియేటర్, ఇల్యూమినేషన్స్, సౌండ్ అండ్ లైట్ షో, డిజిటల్ ఇంటర్‌వెన్షన్, పార్కింగ్ ఏరియా, టాయిలెట్ కాంప్లెక్స్‌లు, సావనీర్ షాపులు, ఫుడ్‌కోర్ట్, ఎటిఎం, బ్యాంకింగ్ సేవలు తదితర అత్యాధునిక సౌకర్యాలను భక్తులకు ప్రసాద్ స్కీం క్రింద అందుబాటులోకి రానున్నాయి. భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ సెక్రటరీ అరవింద్ సింగ్, ఏపి టూరిజం ఎండి అండ్ సిఇఒ కన్నబాబు, టూరిస్ట్ డెవలప్మెంట్ చైర్మన్ డా. వరప్రసాద్ రెడ్డిలు స్కీం వివరాలను భారత రాష్ట్రపతికి వివరించారు.

శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించిన భారత రాష్ట్రపతి

శ్రీశైల మహా క్షేత్రంలోని శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, తెలంగాణ తెలంగాణ రాష్ట్ర గౌవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌లకు గిరిజన చెంచు విద్యార్థులతో స్వాగత నృత్యంతో, శివాజీ స్ఫూర్తి కేంద్రం అధ్యక్షులు టిజి.వెంకటేష్ తదితరులు ఆహ్వానం పలికారు. అనంతరం చెంచు మహిళలతో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన మహిళలైన గంగమ్మ, వెంకటమ్మ, భ్రమ రాంబ, ఉప్పులాపురం గంగమ్మలతో సంభాషిస్తూ జీవన స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం గృహాలు నిర్మించి ఇచ్చారా లేదా, నిత్యావసర వస్తువుల రేషన్ సరుకులు సరిగా అందు తున్నాయా తదితర విషయా లపై ముచ్చటించారు. 3233 చెంచు కుటుంబాలకు 10,153 ఎకరాల ఆర్ఒఎఫ్ఆర్ భూములను అం దించారన్నారు. ఈ భూములలో బోర్వెల్లులు, విద్యుద్దీకరణ అటవీ శాఖ నుండి అభ్యంతరాలు ఉన్నాయని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అటవీ శాఖ వారి నుండి అనుమతులు మంజూరు చేయాలని కోరారు. గత 15 సంవత్సరాల కిందట ఇచ్చిన గృహాలు శిథిలావస్థకు చేరాయని, పిఎంఎవై పథకం ద్వారా 6000 కొత్త గృహాలను నిర్మించేలా చర్యలు తీసుకోవాలని గిరిజన మహిళలు కోరారు. అనంతరం సాయంత్రం భారతరాష్ట్రపతి హెలిప్యాడ్‌కు చేరుకుని వెళ్లిపోయారు. కార్యక్రమాలలో జెసి టి.నిశాంతి, ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ మేద జోష్ణవి, ఐటిడి ఏ పిఒ రవీంద్రారెడ్డి, శివాజీ స్ఫూర్తి కేంద్ర వైస్ ప్రెసిడెంట్ ఉద్యాజి, కేంద్ర ఇంచార్జి నాగేశ్వర రావు, సెక్రెటరీ జి.రఘురామయ్య, ధర్మకర్తల మండలి సభ్యులు విరూపాక్షయ్యస్వామి, గురు మహంత్ మహేష్, విజయలక్ష్మి, మేరాజోత్ హను మంత్ నాయక్, మధుసూదన్ రెడ్డి, పద్మజ, మాధవీ లత, కనకదుర్గ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భారతరాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు స్వాగతం పలుకుతున్న మంత్రి బుగ్గన

భారతరాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పూలబొకే అందజేస్తున్న మంత్రి రోజా

చంద్రమౌళి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి

ధర్మారెడ్డికి ప్రముఖుల పరామర్శ

ప్రజాశక్తి - జూపాడుబంగ్లా

టిటిడి కార్యనిర్వహణాధికారి ధర్మారెడ్డిని, వారి కుటుంబ సభ్యులను పలువురు ప్రముఖులు పరామర్శించారు. మంత్రులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు, పినిపే విశ్వరూప్, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆర్‌కె.రోజా, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఎపి పురపాలక శాఖ కార్యదర్శి శ్రీలక్ష్మి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కర్నూల్ మేయర్ బివై రామయ్య, మాజీ ఎమ్మెల్యేలు, పలువురు ఐఏఎస్ అధికారులు, టిటిడి కమిటీ సభ్యులు, తిరుపతి కార్పొరేటర్ పెంచలయ్య, తదితరులు సోమవారం పారుమంచాల గ్రామానికి ధర్మారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. టిటిడి కార్యనిర్వహణాధికారి ధర్మారెడ్డి కుమారుడు ఎవి చంద్రమౌళి రెడ్డి హఠాన్మరణం చెందిన విషయం తెలిసిందే. చంద్రమౌళి రెడ్డి చిత్ర పటానికి వారు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ధర్మారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సంజామల

గ్రామాల అభివృద్ధే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం సంజామలలో నిర్వహించిన వైసిపి సమన్వయకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సంజామల నుంచి పేరుసోమల వరకు, పేరుసోమల నుంచి తిమ్మినాయన పేట, కోయిలకుంట నుంచి పేరుసోమల వరకు వైసిపి ప్రభుత్వ హయాంలోనే రోడ్ల నిర్మాణం జరిగిందని తెలిపారు. రూ. 12 కోట్లతో ముదిగేటి నుంచి సంజామల వరకు డబల్ రోడ్డు మంజూరు అయిందని పేర్కొన్నారు. సమన్వయకర్తలు సచివాలయానికి ఒకరు చొప్పున ఉంటారని, వాలంటీర్ల పనితీరును గమనిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, పేరు సోమల చిన్నబాబు, గుండం సూర్య ప్రకాశ్ రెడ్డి, ముదిగేడు శేఖర్ రెడ్డి, ముక్కమల్ల మాజీ సర్పంచ్ పోచ వెంకట్రాంరెడ్డి, ఆకుమల్ల ఎంపీటీసీ కిరణ్ కుమార్ రెడ్డి, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

సిపిఎం సానుభూతిపరుడు సాల్మన్ రాజు మృతి

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలోని 42వ వార్డు బయటపేటలో నివాసముంటున్న సిపిఎం సానుభూతి పరుడు సాల్మన్ రాజు సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలిసిన సిపిఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పుల్లా నరసింహులు మాట్లాడుతూ అంచుల సాల్మన్ రాజు మరణం సిపిఎంకి తీరని లోటని అన్నారు. సాల్మన్ రాజు 2021 కౌన్సిలర్ ఎలక్షన్స్ సమయంలో సిపిఎం తరపున ప్రచారం చేశాడని, ఓట్లు సిపిఎంకి వేయించడంలో కీలక పాత్ర పోషించారన్నారు. అధికార పార్టీ నాయకులు ఆ సమయంలో అతన్ని ఎంత బెదిరించినా బెదరకుండా ధైర్యంగా సిపిఎం ప్రచారంలో పాల్గొన్నాడని తెలిపారు. సాల్మన్ రాజు కుటుంబానికి సిపిఎం ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, రవి రాజు, చిరు, దుర్గా, రమేషు తదితరులు పాల్గొన్నారు.

సాల్మన్ రాజుకు నివాళులు అర్పిస్తున్న నాయకులు

రబీ పంటల నమోదు తప్పనిసరి : ఎఒ

ప్రజాశక్తి - మహానంది

ప్రస్తుతం రబీ సీజన్లో సాగు చేస్తున్న పంటల వివరాల నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మహానంది మండల వ్యవసాయ శాఖ అధికారి బి .నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోనిమసీదుపురం గ్రామంలో ఈ క్రాప్ బుకింగ్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తమ పొలంలో వేసిన పంటను గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ఈ క్రాఫ్ట్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. రైతులు పంట ఉత్పత్తులను అమ్ముకోవడానికి, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతిన్నప్పుడు ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయ సహకారాలు అందడంతో పాటు ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా వర్తించే అవకాశం ఉందన్నారు. కౌలు రైతులతో పాటు ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ సంజీవరెడ్డి, గ్రామ వ్యవసాయ శాఖ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

భర్త షాపు ముందు భార్య పురుగు మందు డబ్బాతో నిరసన

ప్రజాశక్తి - బనగానపల్లె

ఓ మహిళ తన భర్త సంసారానికి తీసుకెళ్లడం లేదని భర్త పెస్టిసైడ్స్ షాపు ముందు పురుగు మందు డబ్బాతో కుటుంబ సభ్యులతో కలిసి నిరసన వ్యక్తం చేసిన ఘటన సోమవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో చోటు చేసుకుంది. బాధితురాలు దివ్యభారతి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. బనగానపల్లె మండలంలోని ఎర్రగుడి గ్రామానికి చెందిన నాగేశ్వర రెడ్డి, మహేశ్వరమ్మ దంపతుల రెండవ కూతురు దివ్యభారతిని పసువల గ్రామానికి చెందిన చిన్నపురెడ్డి, పార్వతమ్మల కుమారుడు హర్షవర్ధన్ రెడ్డికి ఇచ్చి 10 నెలల కిందట వివాహం చేశారు, పెళ్లిలో వరకట్నం కింద 10 తులాల బంగారాన్ని ఇచ్చారు. దివ్యభారతిని అదనపు కట్నం తీసుకురావాలని పెళ్లి అయిన నెల రోజులకే పుట్టింట్లో వదిలిపెట్టాడు. ఆనంతరం సంసారానికి పిలుచుకెళ్లడానికి రాకపోవడంతో దివ్యభారతి, కుటుంబ సభ్యులు మహిళా సంఘాలతో కలిసి హర్షవర్ధన్ రెడ్డికి చెందిన సప్తగిరి పెస్టిసైడ్స్ షాపు ముందు దివ్యభారతిని కాపురానికి తీసుకెళ్లాలని నిరసన వ్యక్తం చేశారు. దివ్య భారతి మాట్లాడుతూ పెళ్లిరోజు జరిగిన రోజు నుండి తరచు తనపై అనుమానంతో, అదనపుకట్నం తీసుకురావాలని తన భర్త వేధింపులకు గురి చేస్తున్నాడని తెలిపింది. తన భర్త తనను కాపురానికి తీసుకువెళ్లాలని, లేకపోతే ఆత్మహత్య శరణ్యమని, తనకు న్యాయం చేయాలని కోరింది.

ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అవుకు ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎస్ఐ

ప్రజాశక్తి - అవుకు

అవుకు పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ప్రజాశక్తి 2023 నూతన క్యాలెండర్‌ను అవుకు ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజాశక్తి పత్రికారంగంలో అంచలంచెలుగా ఎదుగుతూ ప్రజల మన్ననలు పొందుతుందని తెలిపారు. ప్రజల సమస్యలపై ఎల్లప్పుడూ ముందుండే పత్రిక ప్రజాశక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రజాశక్తి అవుకు విలేకరి శ్రీనివాసులు, కానిస్టేబుల్స్ సుబ్బరాయుడు, బాలరాజు, మహిళా కానిస్టేబుల్ భారతి పాల్గొన్నారు

సున్నిపెంట మెడికల్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలి

- ఎపి ప్రభుత్వ నర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డి.మంజులాదేవి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సున్నిపెంటలోని సిహెచ్‌సిలో పని చేస్తున్న నర్సింగ్ సిబ్బందిని, ఇతర సిబ్బందిని వేధిస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రజినిపై చర్యలు తీసుకోవాలని ఏపి ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డి. మంజులా దేవి అధికారులను కోరారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ సున్నిపెంట సిహెచ్‌సిలో మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ డి.రజిని 6 సంవత్సరాల నుండి విధులు నిర్వహిస్తున్నారని, 4 సంవత్సరాల నుండి డిడిఒగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. డిడిఒగా పవర్ వచ్చినప్పటి నుండి నర్సింగ్ సిబ్బంది మీద దురుసుగా ప్రవర్తిస్తున్నారని చెప్పారు. సీనియర్ హెడ్ నర్స్ విజయ లక్ష్మిని ఇష్టంవచ్చినట్లు తిట్టడం దారుణమన్నారు. మెడికల్ ఆఫీసర్ సొంత ఇంటి పనిని సీనియర్ హెడ్ నర్స్ దగ్గరుండి చేయించలేదని దూషించడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. డాక్టర్ రజిని సీనియర్ హెడ్ నర్స్‌కి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే సమస్యను పై అధికారులు, కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు.

మాట్లాడుతున్న మంజులా దేవి

16 నుండి అహోబిలం లక్ష్మీనరసింహస్వామి పారువేట ఉత్సవాలు

-33 గ్రామాల్లో 40 రోజులపాటు పర్యటించనున్న ఉత్సవ పల్లకి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రముఖ వైష్ణవక్షేత్రమైన అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి పారువేట ఉత్సవాలు జనవరి 16 నుంచి ప్రారంభం కానున్నాయి. పారువేట ఉత్సవ పల్లకి మూడు మండలాల్లోని 33 గ్రామాల్లో 40 రోజులపాటు పర్యటించనుంది. ఈ సందర్భంగా సోమవారం అహోబిలం ప్రతినిధి సంపత్, మేనేజర్ శ్రీనివాసన్ , ప్రధాన అర్చకులు వేణుగోపాలన్ మాట్లాడారు. ఆయా గ్రామాల్లోని తెలుపులపై పారువేట ఉత్సవ పల్లకిలో కొలువు దీరిన జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాద వరద స్వామిలు మార్చి మాసంలో అహోబిల క్షేత్రంలో జరిగే తమ కళ్యాణోత్సవానికి భక్తులను స్వయంగా ఆహ్వానించేందుకు రానున్నారని తెలిపారు. జనవరి 16న రాత్రి కనుమ పండుగ రోజు అహోబిల క్షేత్రంలో ఉత్సవ కళ్యాణ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి, కుంభహారతి సమర్పించిన అనంతరం పారువేట ఉత్సవ పల్లకి బాచేపల్లె గ్రామానికి చేరుకుంటుందని చెప్పారు. 18న బాచేపల్లె మజార కొండంపల్లి, ఆర్.కృష్ణాపురం గ్రామానికి చేరుకుంటుం దన్నారు. 20న కోటకందుకూరు, 21న మర్రిపల్లె, 22న యాదవాడ, 23న రుద్రవరం మండలంలోని ఆలమూరు గ్రామానికి చేరుకుని రెండు రోజులు పాటు పూజలు అందుకున్న అనంతరం 25న తిమ్మనపల్లెకు చేరుకుంటుందన్నారు. 26న నరసాపురం, 27న ముత్తలూరు, 28న నల్లవాగుపల్లె, 29న బాచ్చాపురం మెట్ట (చదల్లదిన్నె), 30న నరసరావుపేట (మిద్దెలు), అదే రోజు రాత్రి ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పి నాగిరెడ్డి పల్లె, 31న పడకండ్ల గ్రామం చేరుకుంటుందన్నారు. పడకండ్లలో రెండు రోజులు పాటు పూజలు అందుకున్న ఉత్సవ పల్లకి ఫిబ్రవరి 2న ఆళ్లగడ్డ పట్టణం చేరుకుంటుందని చెప్పారు. ఆళ్లగడ్డ పట్టణంలోని వివిధ వీధుల్లో ఐదు రోజులపాటు ప్రజల నుండి పూజలు అందుకొని 6వ తేదీ ఎస్.లింగందిన్నె చేరుకుంటుందని తెలిపారు. 7వ తేది ఉయ్యాలవాడ మండలంలోని సర్వాయిపల్లె గ్రామం చేరుకుంటుందని, అక్కడ కోనేరు వద్ద ఉత్సవమూర్తులైన స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించిన అనంతరం రెండు రోజులు పాటు భక్తుల నుండి పూజలు అందుకుని 9న ఆళ్లగడ్డ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. అక్కడి నుండి అదే రోజు మధ్యాహ్నం పి.చింతకుంట్లకి చేరుకొని 10న ఉదయం దేవరాయపురం, రాత్రి గుబగుండం, 11న జి.జంబులదిన్నె, 12న రుద్రవరం మండలంలోని మందలూరు, 13న నక్కలదిన్నె, 14న చందలూరు, 15న చిలకలూరు, 16న తిప్పారెడ్డిపల్లె, 17న టి.లింగందిన్నె, 18న ఎస్.నాగుల వరం, 19న తువ్వపల్లె, 20న రుద్రవరం మండల కేంద్రంలో ఉత్సవ పల్లకి అడుగుపెట్టి మూడు రోజులు పాటు భక్తుల నుండి పూజలు అందుకుని 24న అహోబిల క్షేత్రం చేరుకుంటుందని తెలిపారు.

పొట్టేళ్ల పందేలను ప్రారంభిస్తున్న గౌరు వెంకటరెడ్డి

పందేలు సంప్రదాయాలకు చిహ్నం : గౌరు

ప్రజాశక్తి - పాములపాడు

క్రిస్మస్ పండగను పురస్కరించుకొని పొట్టేళ్ల పందేలు నిర్వహించడం సంప్రదాయాల చిహ్నం అని నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్షులు గౌరు వెంకట్ రెడ్డి అన్నారు. మండలంలోని మద్దూరు గ్రామంలో ఆర్‌సిఎం చర్చి సంఘ పెద్దల ఆధ్వ ర్యంలో క్రిస్మస్ సందర్భంగా పొట్టేళ్ల పందేలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గౌరు వెంకట్ రెడ్డి హాజరై పోటీలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలు నిర్వహించడం ఐక్యతకు చిహ్నం అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు హరినాథ్ రెడ్డి, తిమ్మారెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, చంద్రశేఖర్, గోవిందు, తెలుగు యువత మండల అధ్యక్షులు మధు, కృష్ణ, అబ్దుల్ హాఫీజ్, ఆర్‌సిఎం గ్రామ పెద్దలు పాల్గొన్నారు. పోటీలలో ప్రథమ విజేతగా తిమ్మాపురం గ్రామానికి చెందిన హనుమన్న పొట్టేలు నిలువగా రూ.10000 బహుమతిని అందజేశారు. రెండో విజేతగా గొందిపర్లకు చెందిన ప్రభాస్ పొట్టేలు, మూడో విజేతగా గొందిపర్లకు చెందిన మరో పొట్టేలు, నాలుగో బహుమతిగా మద్దూరు గ్రామానికి చెందిన కుళాయి పొట్టేలు నిలిచాయి.

రామగోపాల్ రెడ్డిని గెలిపించాలి : టిడిపి

ప్రజాశక్తి - మహానంది

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి భూమి రెడ్డి రామ గోపాల్ రెడ్డికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ నాయకులు సోమవారం మహానంది మండలంలో ప్రచారం నిర్వహించారు. సాయి శ్రీనివాసరెడ్డి, నాయకులు మండ లంలోని పంచాయతీ కార్యాలయాలతో పాటు పాఠశాలలు, ఆయా గ్రామాల్లోని పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల రామక్రిష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో కర్నూల్ జిల్లా జీత్ కునే డో కరాటే సంఘం ఆధ్వర్యంలో జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి, టోర్నమెంట్ డైరెక్టర్ బాలకృష్ణ నిర్వహణలో నంద్యాల, కర్నూల్ జిల్లాల కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు సోమవారం నిర్వహించారు. అనంతరం జిల్లా జీత్ కునే డో కరాటే సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ ముఖ్య అతిథిగా, శాంతినికేతన్ విద్యాసంస్థల గౌరవ సలహాదారు సుధాకర్ గౌరవ అతిథిగా పాల్గొని బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలలో ఉత్తీర్ణులైన క్రీడాకారులకు గ్రీన్, బ్లూ, ఎల్లో, ఆరంజ్, రెడ్ బెల్టులు, యోగ్యతా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్‌లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సిఐని సస్పెండ్ చేయాలి : సిపిఐ

ప్రజాశక్తి - చాగలమర్రి

ఇటీవల రహదారి ప్రమాదంలో గాయపడిన చాగలమర్రి దళిత పాత్రికేయుడు చెన్నకేశవపై అక్రమ కేసు బనాయించిన ఆళ్లగడ్డ రూరల్ సిఐ రాజశేఖర్ రెడ్డిని సస్పెండ్ చేయకుంటే ఉద్యమిస్తామని జిల్లా సీపీఐ కార్యదర్శి రంగనాయుడు హెచ్చరించారు. ప్రమాదంలో గాయపడిన చెన్నకేశవను సోమవారం వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీ న్, జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్, నాగరాముడు, ధనుంజయ్, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి బనగానపల్లె శివయ్యలు పాల్గొన్నారు.

వైసిపి బలోపేతానికే కన్వీనర్లు, గృహ సారథులు

- మండలి విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల నాని

ప్రజాశక్తి - చాగలమర్రి

వైసిపిని మరింత బలోపేతం చేయాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పార్టీ తరపున సచివాలయ కన్వీనర్లను, గృహ సారథులను రాష్ట్రంలో నియమించాలని సంకల్పించారని శాసనమండలి విప్ ప్రభాకర్ రెడ్డి, ఆళ్లగడ్డ శాసనసభ్యులు గంగుల బిజేంద్ర రెడ్డిలు తెలిపారు. సోమవారం ఎస్సార్ ఫంక్షన్ హాల్లో నియోజకవర్గ పరిశీలకుడు పో రెడ్డి నరసింహారెడ్డి పర్యవేక్షణలో జరిగిన మండల వైసిపి కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలకు మించి సంక్షేమ పథకాలను అమలు చేశారని వాటిని ప్రజలకు వివరించి పార్టీని ఇంకా బలోపేతం చేయవలసి ఉందన్నారు. మనం ఎంతో అభివృద్ధి చేశామని ఆ అభివృద్ధిని సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించవలసి ఉందని వారు తెలిపారు. ప్రతి గ్రామ సచివాలయానికి పార్టీ తరపున ముగ్గురు కన్వీనర్లను నియమించాలని, వీరిలో ఇద్దరు పురుషులు ఒకరు మహిళ తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రతి ఇంటికి ఇద్దరు గృహ సారథులు ఉంటారని, వీరిలో ఒకరు పురుషుడు, ఒక మహిళ ఉండాలని వారు తెలిపారు. ఈ ప్రకారం కన్వీనర్‌లను గృహ సారథులను నియమించుకోవాలని వారు సూచించారు. ఈ నియమించబడిన కన్వీనర్లు గృహ సారథులు 15 రోజుల వ్యవధిలో అన్ని కుటుంబాలను కలవాలన్నారు. అలాగే సచివాలయాలకు ఎంపిక చేసిన పార్టీ కన్వీనర్లు కూడా గడపగడపకు తిరగాలని ఆయన కోరారు. సచివాలయ పరిధిలో పార్టీ కార్యక్రమాలు చురుగ్గా కొనసాగడానికి వీరు పని చేస్తారన్నారు. కన్వీనర్ల నెట్వర్క్ బలంగా ఉంటే గెలవడం అనేది చాలా సులభం అవుతుందని ముఖ్యమంత్రి ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. వైయస్సార్ కాంగ్రెస్

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, చిత్రంలో ఎమ్మెల్యే

పార్టీపై అభిమానం కలిగి ఉత్సాహంగా, చక్కగా పనిచేస్తూ ఓపికతో ప్రజల వద్దకు వెళ్లి సంక్షేమ పథకాలు వారికి వివరించే వ్యక్తులను నియమిం చాలన్నారు. వీరికి వీరి కుటుంబ సభ్యులకు ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తుంద న్నారు. ఈ సమావేశం లో వైసీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబూలాల్, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, మండల అధ్యక్షుడు వీరభద్రుడు, ఉప మండల అధ్యక్షుడు ముల్లా రఫీ, సీనియర్ వైసీపీ నాయకులు ఎంపీటీసీలు పత్తి నారాయణ, ఫయాజ్, లక్ష్మిరెడ్డి, నరసింహులు, ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ముల్లా జాబీర్, సర్పంచులు గోవిందయ్య, ప్రతాపరెడ్డి, ఈదుల దస్తగిరి రెడ్డి, సంజీవ రాయుడు, చాగలమర్రి ఉపసర్పంచ్, షేక్ సోహెల్, జిల్లా సేవాదల్ అధ్యక్షుడు వెంకటరమణ, సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, డైరెక్టర్ శ్రీనివాసులు, సాగునీటి సంఘ అధ్యక్షుడు శేష రమేష్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి నుంచి 25 కుటుంబాలు వైసిపిలో చేరిక

రుద్రవరం : మండల కేంద్రం రుద్రవరంలోని బెస్త కాలనీకి చెందిన 25 కుటుంబాల టిడిపి నాయకులు వైసిపిలో చేరారు. సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పుటాలమ్మ క్షేత్రం ఆలయ కమిటీ చైర్మన్ వైసిపి సీనియర్ నాయకులు గంగుల మనోహర్ రెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, వైసిపి నాయకుడు హరి నారాయణ ఆధ్వర్యంలో బెస్తకాలానికి చెందిన కొండబోయిన రమణ, చిట్టిబాబు పెద్దయ్య శీను శ్రీకాంత్ మరో కుటుంబాలకు చెందిన నాయకులు కార్యకర్తలకు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ టిడిపిలో ఎన్నో సంవత్సరాలుగా ఉన్నా.. తమకు ఎలాంటి గుర్తింపు లేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై వైసిపిలో చేరామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

వైసిపిలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే గంగుల నాని

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

జిల్లా మహాసభను జయప్రదం చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - ప్యాపిలి

ఈనెల 27, 28 తేదీల్లో నంద్యాలలో జరిగే రెండవ సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు ప్యాపిలి మండల కార్యదర్శి అబ్దుల్ రహమాన్, డోన్ మండల కార్యదర్శి పి. రామాంజనేయులు పేర్కొన్నారు. సోమవారం జలదుర్గం గ్రామంలో మాసూమ్ అధ్యక్షతన సిఐటియు నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం నాడు వేలాది కార్మికులతో భారీ ప్రదర్శన నిర్వహించి, అనంతరం భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. మాజీ ఎమ్మెల్యే, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. గపూర్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మిలు ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. సిఐటియు జిల్లా మహాసభల సందర్భంగా జిల్లా నలుమూలల నుండి దాదాపు 250 మందికి పైగా కార్మిక సంఘాల ప్రతినిధులు హాజరవుతారని అన్నారు. ఈ మహాసభలలో గత మూడు సంవత్సరాలలో కార్మిక సంఘాల పనితీరును సమీక్షించుకొని భవిష్యత్ కార్యక్రమాలను రూపొందించుకుంటామని అన్నారు. అనంతరం ఏర్పడే నూతన సిఐటియు జిల్లా కమిటీ భవిష్యత్తు ఉద్యమాలకు కావలసిన తీర్మానాలను ఆమోదిస్తుందని తెలియజేశారు. ఈ మహాసభలలో ప్రదర్శన బహిరంగ సభలలో అన్ని కార్మిక రంగాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు హుస్సేన్, సిఐటియు నాయకులు కోటిరెడ్డి, శ్రీను, సుధాకర్, సుబ్రహ్మణ్యం, మద్దయ్య, వలి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా, ఎంప రషీద్

లబ్ధిదారులకు పింఛన్ వచ్చేందుకు కృషి చేయాలి

- మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా

ప్రజాశక్తి - ఆత్మకూర్

పట్టణంలో పెన్షన్ వస్తు మధ్యలోనే నిలిచిపోయిన అర్హులైన లబ్ధిదారులకు తిరిగి పెన్షన్ వచ్చే విధంగా మున్సిపల్ సచివాలయ అడ్మిన్లు, సెక్రెటరీ వెల్ఫేర్ ఉద్యోగులు కృషి చేయాలని ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా, కో ఆప్షన్ సభ్యులు ఎంఎ రషీద్ సూచించారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ అడ్మిన్ల, సెక్రెటరీ వెల్ఫేర్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత ఉండి ఆన్లైన్లో జరిగిన టెక్నికల్ ఇబ్బందులతో, పొలాలు, ఇళ్ల కొలతల తప్పులతో పెన్షన్ తీసేసిన వారికి తిరిగి పెన్షన్ అమలు చేసే విధంగా కృషి చేయాలని తెలియజేశారు. వైసిపి ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకు రాకుండా సచివాలయ ఉద్యోగులు పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ వెంకటేశ్వర్ గౌడ్, రాంప్రసాద్, సచివాలయ సెక్రెటరీ వెల్ఫేర్లు, అడ్మిన్లు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎస్ రద్దు చేయకపోవడం బాధాకరం

ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల

దేశంలోని పలు రాష్ట్రాల్లో సిపిఎస్ రద్దు అవుతున్నా సిపిఎస్ వ్యతిరేక ఉద్యమం ప్రారంభమైన మన రాష్ట్రంలో మాత్రం ఇప్పటివరకు రద్దు కాకపోవడం బాధాకరమని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. నంద్యాలలోని పాలిటెక్నిక్ కళాశాల, బాలికల జూనియర్ కళాశాలల సిబ్బందిని సోమవారం కలిసి వారి సమస్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసా ఇవ్వని సిపిఎస్ పింఛను పథకానికి వ్యతిరేకంగా రాష్ట్రంలో ఎన్నో సంవత్సరాలుగా ఉద్యమాలు జరుగుతున్నా సిపిఎస్ రద్దుకు అడుగులు వేయకపోవడం శోచనీయమన్నారు. దేశంలో ఇప్పటికే రాష్ట్రాల్లో సిపిఎస్ రద్దు చేశారని, మరికొన్ని రాష్ట్రాల ఎన్నికల్లో సిపిఎస్ రద్దు చేస్తామని హామీలు కూడా ఇస్తున్నారన్నారు. మన రాష్ట్రంలో కూడా సిపిఎస్ రద్దుచేసి పాత పింఛను పథకాన్ని అమలు చేయాలని ఆయన డిమాండు చేశారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న బోధనా సిబ్బందికి రావాల్సిన పిఆర్సి బకాయిలను చెల్లించాలని ఆయన కోరారు. పాలిటెక్నిక్ అధ్యాపకులకు క్రమం తప్పకుండా పదోన్నతులు కల్పించి రెగ్యులర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్జేయూపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్తోజు వీరబ్రహ్మం, ఏపీ సిపిఎస్ఈఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రామ నర్సింహ యాదవ్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రామ చంద్రారెడ్డి, కార్యదర్శి శివయ్య, ఆర్జేయుపి నాయకులు జీవీ సుబ్బారెడ్డి , అన్నెం శ్రీనివాసులరెడ్డి, విశ్రాంత వ్యాయా మో పాధ్యాయులు కోటా ఓబుళ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఒంటెరు శ్రీనివాసులరెడ్డి

ఆటో - బైక్ ఢీ

- వ్యక్తి మృతి
- మహిళకు గాయాలు

ప్రజాశక్తి - పగిడ్యాల

ఆటో - బైకు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని నెహ్రూనగర్ గ్రామ సమీపాన చోటు చేసుకుంది. ముచ్చుమర్రి ఎస్ఐ నాగర్జున తెలిపిన వివరాలు ఇలా ఉన్నయి. నెహ్రూనగర్ గ్రామానికి చెందిన కోటేశ్వరరెడ్డి ఆదివారం రాత్రి పది గంటల సమయంలో నందికొట్కూరు నుంచి బైకుపై పార్వతమ్మ అనే మహిళతో నెహ్రూనగర్ గ్రామానికి వెల్తున్నారు. నెహ్రూనగర్ నుంచి కొణిదేల గ్రామానికి అప్పి ఆటో వస్తుండగా నెహ్రూనగర్ గ్రామ సమీపాన సాయిబాబ దేవాలయం వద్ద ఆటో బైకు ఢీకొన్నాయి. దీంతో తోకల కోటేశ్వరరెడ్డి (64)కి తీవ్ర గాయలు కావడంతో స్థానికులు నందికొట్కూరు ప్రభుత్వ వైద్యాశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో కర్నూలుకు తరలించారు.

మెరుగైన వైద్యం కోసం హైదరాబాదుకు తరలిస్తుండాగా మార్గం మధ్యలో జడ్చర్ల వద్ద సోమవరాం తెల్లవారు జామున మృతి చెందినట్లు ఎస్ఐ నాగార్జున తెలిపారు. గాయలైన పార్వతమ్మ కర్నూలు ప్రభుత్వం ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. మృతుడి భార్య నిర్మలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

ఆధార్ సేవ కేంద్రాలను వినియోగించుకోండి : కమిషనర్

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

నంద్యాల పట్టణంలోని వార్డ్ సచివాలయాలలో, పాఠశాలలో ఈ నెల 27, 28, 29, 30వ తేదీలలో మొబైల్ ఆధార్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ క్యాంపులో ఆరు రకాల ఆధార్ సర్వీసులు అందించబడతాయని చెప్పారు. వార్డు పరిధిలో ఉన్న స్కూల్స్ హెచ్ఎంలు కూడా విషయాన్ని తెలియజేసి విద్యార్థులు ఆధార్ సేవలు ఉపయోగించుకునే విధంగా చూడాలన్నారు. **బండి ఆత్మకూర్ :** మండలంలోని ప్రజలు ఆధార్ సేవా కేంద్రాలను వినియోగించుకో వాలని ఎంపిడిఓ వాసుదేవ గుప్తా తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ నుండి 30వ తేదీ వరకు ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, సేవలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. 27వ తేదీ జిల్లా పరిషత్ హైస్కూల్ బండి ఆత్మకూర్‌లో, 28వ తేదీ భోజనం గ్రామ సచివాలయం నందు, 29న సింగవరం గ్రామ సచివాలయం, 30న జీలింగాపురం గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. **కొలిమిగుండ్ల :** మండలంలోని ప్రజలు ఆధార్ సేవా కేంద్రాలను వినియోగించుకోవాలని ఎంపీడీవో సుబ్బరాజు తెలిపారు. అన్ని గ్రామ సచివాలయాలలో డిజిటల్ అసిస్టెంట్స్‌లతో ఈనెల 27 నుండి 30వ తేదీ వరకు మొబైల్ ఆధార్ క్యాంప్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హాజరైన డిజిటల్ అసిస్టెంట్స్ లక్ష్మి ప్రసన్న, జయ కృష్ణ, సేవ్య నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల : ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ

పేదల సమస్యల పరిష్కారమే లక్ష్యం : సిపిఐ

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

పేద ప్రజల సమస్యల పరిష్కారమే సిపిఐ లక్ష్యమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రంగనాయుడు తెలిపారు. సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయం వద్ద 98వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ప్రసాద్, సీనియర్ నాయకుడు సంజీవులు, నాయకులు పాల్గొన్నారు. **రుద్రవరం** మండలంలోని పెద్ద కంబలూరు, చిన్న కంబలూరు గ్రామాలలో సిపిఐ మండల కార్యదర్శి బాల నరసింహుడు అధ్యక్షతన పతావిష్కరణ చేశారు. ఏఐవైఎఫ్ మాజీ ప్రధాన కార్యదర్శి పడకండ్ల నరసింహులు, సిపిఐ తాలూకా కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నారు. **బనగానపల్లె**లోని కోర్టు ఆవరణలో కోయిలకుంట్ల బస్టాప్ వద్ద సిపిఐ జెండాను మహిళా సమైక్య నాయకురాలు రామసుబ్బమ్మ ఎగరవేశారు. సిపిఐ మండల సహాయ కార్యదర్శి శివ బాలకృష్ణ, గిరిజన సమైక్య జిల్లా అధ్యక్షులు కాలింగి రాముడు తదితరులు పాల్గొన్నారు .**సిరివెళ్ల :** మండలం ఇసుకపల్లి గ్రామంలో సిపిఐ ఆళ్లగడ్డ కార్యదర్శి కె భాస్కర్ పతాకావిష్కరణ చేశారు. జిల్లా కార్యదర్శి ఎన్ రంగరాయుడు, సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. **మహానంది** మండలంలోని మహానంది, శ్రీనగరం, బుక్కాపురం, అబ్బీపురం గ్రామాలలో పతాకావిష్కరణ చేశారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్, మండల కార్యదర్శి వీరప్ప, జిల్లా సమితి సభ్యుడు ఆర్ సామెల్ పాల్గొన్నారు. **బేతంచర్ల :** మండల కేంద్రంలో సిపిఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సిపిఐ మండల కార్యదర్శి వై భార్గవ్, తిరుమలేష్, దస్తగిరిల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాలకవర్గాలు చేస్తున్న ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు కొనసాగిస్తూ నిత్యం ప్రజల పక్షాన సిపిఐ పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దస్తగిరి, తిరుమలేష్, జిల్లా నాయకులు ఉదయ్, సిపిఐ మండల నాయకులు ఎల్లకృష్ణ, జగదీష్, తదితరులు పాల్గొన్నారు. **ప్యాపిలి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటలకు సిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ పేర్కొన్నారు. సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ 98వ స్థాపక దినోత్సవం సందర్భంగా స్థానిక సిపిఐ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. పట్టణ ముఖ్య కార్యదర్శి పిక్కిలి వెంకటేసు, ఎర్రి తాత, గోవిందు రవి బాష తదితరులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరిస్తున్న సిపిఐ నాయకులు

వైసిపి పాలనకు స్వస్తి పలకండి : టిడిపి

ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న ధర్మవరం సుబ్బారెడ్డి, నాయకులు

నందికొట్కూరులో..

ప్రజాశక్తి - బేతంచెర్ల

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న వైసిపి పాలనకు స్వస్తి పలకాలని టిడిపి డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి అన్నారు. బేతంచెర్ల నగర పంచాయతీ 5వ వార్డులో టిడిపి మండల కన్వీనర్ ఉన్నము ఎల్ల నాగయ్య, పట్టణ కార్యదర్శి శిక్షావల్లి చౌదరి ఆధ్వర్యంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మవరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాజకీయ కక్షలతో పెన్షన్లు, రేషన్ కార్డులు తొలగించడం దారుణం అన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైసిపికి బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బేతంచర్ల మండల సమన్వయ కమిటీ చైర్మన్ గున్నం చంద్రశేఖర్ చౌదరి, తిరుమల చౌదరి, ఉన్నం సుధాకర్, రాష్ట్ర ముస్లిం మైనార్టీ నాయకులు, మాజీ ఎంపీటీసీ జాకిర్ల బేగ్, టిడిపి కౌన్సిలర్ రామాంజనేయులు, రామ్మూర్తి, నంద్యాల మధు, డోన్ నియోజకవర్గ వాణిజ్య కమిటీ అధ్యక్షుడు రేగటి భీమారెడ్డి, అధ్యక్షుడు టైలర్ రాముడు, లోకేష్ గౌడ్, ముస్లిం నాయకులు ఫయాజ్, కుమ్మరి శ్రీనివాసులు, బేతంచెర్ల పట్టణ ఐటిడిపి అధ్యక్షుడు అరుణ్ కుమార్, వాసు, కాలాల అంజి, రామవరం,తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** పట్టణంలోని హాజీ నగర్ ఏరియాలో ఇదేమి ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం షకీల్ అహ్మద్ రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజలపై బారాలు వేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దింపాలని టిడిపి నియోజకవర్గ ముస్లిం అధికార ప్రతినిధి షకీలా అహ్మద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు నియోజ కవర్గ ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షులు సౌదీ చాంద్, నందికొట్కూరు పట్టణ ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు రషీద్ ఖాన్, ముస్లిం నాయకులు అబ్దుల్ వహీద్,అబ్దుల్లా, షేక్. హమీద్,సయ్యద్ అహమ్మద్, చిన్న ముర్తుజావలి, హసన్ మియా, కార్యకర్తలు పాల్గొన్నారు. **బనగానపల్లె :** రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తుందని పాతపాడు గ్రామ సర్పంచి బెడదల మహేశ్వర రెడ్డి విమర్శించారు. సోమవారం మండలంలోని పాతపాడు గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని టిడిపి సర్పంచి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో సర్పంచి, టిడిపి నాయకులు ఇంటింటికి తిరిగి మన రాష్ట్రానికి ఇదేం కర్మ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శంకేశ్వర రెడ్డి, షేఖన్నా, కొండయ్య, గోపాలకృష్ణ, నందమ్మ గారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి, నాయకులు

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్

పట్టణంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని బిజెపి ఒబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు శివకృష్ణ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ రామకృష్ణకు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండల అధ్యక్షులు శరత్‌చంద్రకుమార్ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా శివకృష్ణ యాదవ్ మాట్లాడారు.

బిజెపి జిల్లా కార్యదర్శి యాదగిరి, ఉపాధ్యక్షుడు శివరామరెడ్డి, ఒబిసి నాయకులు కంబయ్య యాదవ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్

నంద్యాల పట్టణంలో నేడు, రేపు జరగనున్న సిఐటియు జిల్లా మహాసభను విజయవంతం చేయాలని సిఐటియు బనగానపల్లె డివిజన్ అధ్యక్షులు జీవీ సుబ్బయ్య కోరారు. సోమవారం సివిల్ సప్లై హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్‌లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సిఐటియు జిల్లా మహాసభలకు కార్మికులందరూ తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మహబూబ్ బాషా, గోవిందు, రామాంజనేయులు, ఖాజా హుస్సేన్, షంషీర్, సాధిక్, కరిముల్లా, మద్దిలేటి, బషీర్, చిన్న వ్యాపారుల సంఘం వెంకటేశ్వర్లు, నరసింహులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి - ఆత్మకూర్

పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే గౌడ్ సెంటర్లో తోపుడు బండ్లు వ్యాపారస్తుల ద్వారా ట్రాఫిక్ జామ్ అవుతోందని, ట్రాఫిక్ సమస్య సృష్టిస్తే జరిమానాలు తప్పవని ఆత్మకూరు ఎస్సై హుస్సేన్ బాష హెచ్చరించారు. సోమవారం ఎస్ఐ గౌడ్ సెంటర్‌ను పరిశీలించి తోపుడు బండ్లు, వ్యాపారస్తులతో మాట్లాడారు. తోపుడు బండ్ల వ్యాపారస్తులు రోడ్లపై బండ్లు పెట్టకుండా, పక్కన పెట్టుకుని వ్యాపారం చేయాలని ట్రాఫిక్ సమస్య మరోసారి ఉత్పన్నమైతే చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు.

జల జీవన్ మిషన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండలములోని బి ఉప్పాలురు గ్రామంలో జల జీవన్ మిషన్ కింద నిర్మిస్తున్న భూ ఉపరితల సర్వీసింగ్ రిజర్వాయర్ పనులను ఎంపిడివో సుబ్బరాజు సోమవారం పరిశీలించారు. ఎంపిడివో మాట్లాడుతూ జెజెఎం నిధుల కింద పనులు యుద్ధ ప్రాతిపదికంగా జరుగుతున్నాయన్నారు. త్వరలో నిర్మాణం పూర్తి అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఇ సుబ్రమణ్యం, సర్పంచ్ ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

శేషారెడ్డి నగర్ రామలక్ష్మమ్మ నేత్రదానం

ప్రజాశక్తి - బేతంచర్ల

మండల కేంద్రంలో శేషారెడ్డి నగర్ కాలనీ నివాసి అయిన రామలక్ష్మమ్మ (57) నేత్రాలను వారి కుటుంబ సభ్యులు దానం చేశారు. ఈమె గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మరణించింది. మృతురాలి కుమారుడు నాగేశ్వర్రెడ్డి తన తల్లి నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. ఈ విషయాన్ని లైఫ్ యువ నేత్ర సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు కర్నూలు గవర్నమెంట్ హాస్పటల్ టెక్నీషియన్ ప్రదీప్‌కు సమాచారం ఇవ్వడంతో సోమవారం వారు వచ్చి మృతురాలు నేత్రాలను సేకరించారు.

నేత్రదానం చేస్తున్న రామలక్ష్మమ్మ కుటుంబ సభ్యులు

తొలగించిన పెన్షన్లను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

నంద్యాలలో అర్బన్ ప్రాపర్టీ, వివిధ రకాల నిబంధనల పేరుతో తొలగించిన పెన్షన్స్ ను వెంటనే పునరుద్ధరించాలని డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎపి వ్యవస్థాపక అధ్యక్షులు డిపి.మస్తాన్ వలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సాదిక్ నగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఒకవైపు జనవరి ఒకటో తేదీ నుంచి పెన్షన్‌లో ఇచ్చే అమౌంట్ పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి మరోవైపు పెన్షన్లను తొలగించడం దారుణమన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్, మహమ్మద్ డౌలా తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి పౌరస్మృతి బిల్లును ఉపసంహరించుకోవాలి

- ప్రజాస్వామ్య లౌకిక ఐక్య వేదిక

ప్రజాశక్తి - నంద్యాల

ఉమ్మడి పౌరస్మృతి బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని ప్రజాస్వామ్య లౌకిక ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో ఉమ్మడి పౌర స్మృతికి వ్యతిరేకంగా పోరాటం చేయడం కోసం సోమవారం నంద్యాలలో జమాయతే ఇస్లామి, కాంగ్రెస్ మైనార్టీ సెల్, ఆవాజ్, ఇన్సాప్, ఐయూఎంఎల్, పిడిఎస్యుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ప్రజాస్వామ్య లౌకిక ఐక్య వేదిక ఆధ్వర్యంలో పోరాటాలు చేయాలని నిర్ణయించారు. సమావేశంలో మస్తాన్వలి, అబ్దుల్ సమద్, రఫీ, సలాం మౌలానా, బాబా ఫక్రుద్దీన్ తదితరులు ఐక్య వేదిక కన్వీనర్‌గా ఎస్ఎండి.అబులైస్, కో కన్వీనర్‌గా మస్తాన్ ఖాన్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బిల్లు ప్రవేశ పెట్టడం వల్ల ముస్లింలకు, గిరిజనులకు, క్రిస్టియన్లకు వారి రాజ్యాంగ మత హక్కుల పైన దాడి జరిగినట్లు ఉంటుందని, కాబట్టి దీన్ని వ్యతిరేకిస్తూ పోరాటాలు చేయాలన్నారు. పార్టీలతో నిమిత్తం లేకుండా ఈ ఉమ్మడి పౌరస్మృతిని బిజెపి ప్రభుత్వం ఉపసంహరించే వరకు పోరాడాలని కోరుతూ రాష్ట్రపతి ఆమోదముద్ర కూడా వేయకూడదని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మీడియా ద్వారా కోరారు. ఈ నెల 28వ తేదీ ఉమ్మడి పౌరస్మృతి బిల్లుకు వ్యతిరేకంగా నంద్యాల తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా నిరసన దీక్ష చేయాలని కమిటీలో నిర్ణయించినట్లు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న అబులైస్